కోటగిరి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో..
వీక్షించండి చానల్
NS99 CHANNEL
దగా స్థానంలో నిగా వేసే చానల్

దగా స్థానంలో నిఘా వేసే జాతీయ దిన పత్రిక

నీలగిరి శంఖారావం

సమగ్ర సమాచార దర్శిని

తెలుగు జాతీయ దినపత్రిక

నల్లగొండ | సంపుటి :05 | సంచిక :191 | ఎడిటర్ : కోటగిరి చంద్రశేఖర్ | శుక్రవారం 20-11-2026 | పేజీలు : 4 | వెల : రూ. 3/-

మేడిగడ్డను కాంగ్రెస్ వాళ్లే పెల్చేశారు.. మాజీ మంత్రి కేటీఆర్ తీవ్ర ఆరోపణలు

హైదరాబాద్, కాళేశ్వరం ప్రాజెక్టులో అంతర్భాగమైన మేడిగడ్డ బ్యారేజీని కాంగ్రెస్ పార్టీ నేతలే పేల్చివేశారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ తీవ్ర ఆరోపణలు చేశారు. ఇవాళ తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వంపై, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై విమర్శలు గుప్పించారు.

మేడిగడ్డ మరమ్మతులు, అంచనాలపై విమర్శలు

మేడిగడ్డ బ్యారేజీ దెబ్బతినడంపై అప్పట్లోనే ఇంజినీర్లు పోలీసులకు ఫిర్యాదు చేశారని కేటీఆర్ గుర్తుచేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి మూడేళ్లు గడుస్తున్నా, కేవలం రెండు పిల్లర్లకు మరమ్మతులు చేయించలేకపోతున్నారని ఆయన విమర్శించారు. బీఆర్ఎస్ హయాంలో నిర్మించిన మేడిగడ్డ ప్రాజెక్టు కొట్టుకుపోవాలన్నదే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కోరిక అని కేటీఆర్ ఆరోపించారు. రూ. 400 కోట్లతో పూర్తయ్యే మరమ్మతుల కోసం, రూ. 4,000 కోట్లు ఖర్చు చేయాలని రేవంత్ రెడ్డి భావిస్తున్నారని ఆయన ధ్వజమెత్తారు.

రెగ్యులర్ సీఎం కాదు.. రెన్యువల్ సీఎం..

రాష్ట్రంలో మూడేళ్ల కాంగ్రెస్ పాలనపై ప్రజలు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారని కేటీఆర్ పేర్కొన్నారు. రెండేళ్ల క్రితం కాంగ్రెస్ పాలన గురించి మాజీ సీఎం కేసీఆర్ చెప్పిన మాటలే నేడు అక్షరాలా నిజమవుతున్నాయని అన్నారు. రేవంత్ రెడ్డి రెగ్యులర్ ముఖ్యమంత్రి కాదని, కేవలం 'రెన్యువల్ సీఎం' అని ఆయన ఎద్దేవా చేశారు. ఢిల్లీ పెద్దలు రాష్ట్రానికి వస్తుంటే సీఎం వణికిపోతున్నారని, జాతీయ పార్టీలైన కాంగ్రెస్, బీజేపీలకు చెందిన నేతలు ఢిల్లీ నాయకత్వాలకు



బానిసల్లా మారిపోయారని కేటీఆర్ తీవ్ర స్థాయిలో మండిపడ్డారు.

ఆరు గ్యారెంటీలు, పెన్షన్ల తొలగింపుపై ప్రశ్నలు

ఎన్నికల సమయంలో ఓట్ల కోసం బీఆర్ఎస్ ఎప్పుడూ అవాస్తవాలు చెప్పలేదని కేటీఆర్ స్పష్టం చేశారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ పంపిణీ చేసిన ఆరు గ్యారెంటీల కార్డులు ఏమయ్యాయని ఆయన ప్రశ్నించారు. కొత్త పెన్షన్ల మంజూరు పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం డ్రామా చేస్తోందని ఆయన విమర్శించారు. గత మూడేళ్ల కాలంలో ఏకంగా 4.70 లక్షల పెన్షన్లను తొలగించి, ఇప్పుడు కొత్తగా 4.65 లక్షల మందికి పెన్షన్లు ఇస్తామని చెప్పడం విడ్డూరంగా ఉందని కేటీఆర్ పేర్కొన్నారు. బీఆర్ఎస్ మళ్లీ ఎప్పుడు అధికారంలోకి వస్తుందా అని రాష్ట్ర ప్రజలంతా ఎదురుచూస్తున్నారని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

మంత్రి పదవి కోసమే ఈ రచ్చంతా.. కోమటిరెడ్డిపై రెచ్చిపోయిన పున్న కైలాశ్ నేత

నల్లగొండ , మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి గత కొద్ది రోజులుగా సొంత పార్టీపై, ప్రభుత్వంపై చేస్తున్న విమర్శలను నల్లగొండ జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) అధ్యక్షుడు పున్న కైలాశ్ నేత తీవ్రంగా ఖండించారు. నల్లగొండలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాజగోపాల్ రెడ్డి తీరుపై తీవ్ర అసహనం వ్యక్తం చేశారు.

బహిరంగ విమర్శలతో పార్టీకి నష్టం..

సొంత పార్టీపై, ప్రభుత్వంపై బహిరంగంగా విమర్శలు చేస్తూ ప్రతిపక్షాలకు ఆయుధాలు అందిస్తున్నారని పున్న కైలాశ్ నేత విమర్శించారు. ఈ వ్యాఖ్యలు నిఖార్సయిన సామాన్య కాంగ్రెస్ కార్యకర్తల మనోభావాలను దెబ్బతీస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. 'మీకు మంత్రి పదవి హామీ ఇచ్చింది ఎవరో వారి వద్దే పంచాయతీ పెట్టండి. అంతే కానీ అంతర్గత వేదికలపై మాట్లాడాల్సిన విషయాలను బహిరంగంగా మాట్లాడి మీ గౌరవాన్ని మీరే తగ్గించుకుంటున్నారు' అని హితవు పలికారు. పార్టీకి, ప్రభుత్వానికి తాను వారధిగా ఉన్నానని, ఎవరి ఒత్తిడితోనూ తాను ఈ ప్రెస్ మీట్ పెట్టడం లేదని ఆయన స్పష్టం చేశారు. కేవలం మంత్రి పదవి రాలేదన్న అక్కసుతో, కాంట్రాక్టులు దక్కలేదన్న స్వార్థంతోనే రాజగోపాల్ రెడ్డి ప్రభుత్వాన్ని టార్గెట్ చేస్తున్నారని కైలాశ్ నేత ఆరోపించారు. తెలంగాణ ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయని కొనియాడారు. 1.20 కోట్ల కుటుంబాలకు సన్నబియ్యం పంపిణీ, రూ. 5 లక్షలతో ఇందిరమ్మ ఇండ్లు, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, మహిళలకు ఆర్టీసీలో ఉచిత ప్రయాణం, వడ్డీ లేని రుణాలు, రూ. 2 లక్షల రుణమాఫీ, 20 లక్షల కొత్త రేషన్ కార్డులు, నూతన పెన్షన్లు, 42 శాతం బీసీ రిజర్వేషన్ బిల్లు, ఇంటిగ్రేటెడ్ పాఠశాలలు, ఉద్యోగాల భర్తీ చేశారు. ఇన్ని గొప్ప కార్యక్రమాలు జరుగుతుంటే అవి రాజగోపాల్ రెడ్డికి కనపడటం లేదా అని ప్రశ్నించారు. నల్లగొండ జిల్లాను సస్యశ్యామలం చేసే పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేసేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కంకణం కట్టుకున్నారని, వాటి గురించి మీరెప్పుడైనా మాట్లాడారా



అని నిలదీశారు.

పార్టీ అధిష్టానానికి ఫిర్యాదు..

మునుగోడు అభివృద్ధి పేరుతో కేవలం తన మంత్రి పదవి గోడునే రాజగోపాల్ రెడ్డి చెప్పుకుంటున్నారని విమర్శించారు. తాను డీసీసీ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టి నవంబర్ 22 నాటికి ఏడాది పూర్తవుతున్నా, ఏనాడూ తనను నియోజకవర్గానికి పిలవలేదని, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను విస్మరించారని ఆవేదన వ్యక్తం చేశారు. మునుగోడులో మున్సిపల్ చైర్మన్, మార్కెట్ కమిటీ చైర్మన్ సహా కీలక పార్టీ పదవులన్నీ బీజేపీ నుంచి వచ్చిన వారికే కట్టబెట్టి, దశాబ్దాలుగా పార్టీని నమ్ముకున్న కాంగ్రెస్ కార్యకర్తలకు అన్యాయం చేశారని మండిపడ్డారు. 2014 నుంచి పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు ఏనాడూ పార్టీ కార్యక్రమాలు, ఆందోళనలు చేయని రాజగోపాల్ రెడ్డి.. కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందని తెలిశాకే పార్టీలో చేరారని విమర్శించారు. పార్టీ క్రమశిక్షణను ఉల్లంఘిస్తూ మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఏఐసీసీ, టీపీసీసీ అధిష్టానాలకు అధికారికంగా ఫిర్యాదు చేయనున్నట్లు పున్న కైలాశ్ నేత ప్రకటించారు.

అదనంగా గంట హోటల్ నిర్వహణకు లంచం డిమాండ్..



హైదరాబాద్ : అదనంగా హోటల్ నిర్వహణ కోసం లంచం తీసుకున్న గోల్కోండ జోన్ టోలిచౌక్ ఇన్‌స్పెక్టర్ రమేశ్ నాయక్ ను ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. భవిష్యత్తులో ప్రతి నెల రాత్రి ఒంటి గంట వరకు కేఫెటిరియా తెరిచి ఉండటానికి, ఆన్‌లైన్ ఫుడ్ ఆర్డర్స్ పూర్తి చేయడంలో సహాయం చేయడానికి గాను నిర్వాహకులు ఇన్‌స్పెక్టర్‌ను సంప్రదించారు.దీంతో ప్రతి నెలా రూ.50 వేలు డిమాండ్ చేయగా మొదటి నెల రూ.40 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. మొదటి విడతలో రూ.20 వేలు తీసుకుంటూ పట్టుబడ్డారు. ఏసీబీ అధికారులు చేసిన తనిఖీలో నాలుగు ఎనవలప్ కవర్‌లో రూ.1.80 వేలు నగదు లభించాయని , అతడిపై కేసు నమోదు చేసి నాంపల్లి కోర్టులో

తెలంగాణను 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మారుస్తాం: సీఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్, హైదరాబాద్‌లోని హెచ్ఐసీసీ వేదికగా జరుగుతున్న 85వ ఇండియన్ రోడ్స్ కాంగ్రెస్ వార్షిక సదస్సులో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొని ప్రసంగించారు. ఘన చరిత్ర కలిగిన హైదరాబాద్ నగరానికి విచ్చేసిన దేశవిదేశీ అతిథులకు ఆయన ఘన స్వాగతం పలికారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి వందేళ్లు పూర్తయ్యే 2047 సంవత్సరానికి ఎంతో ప్రాధాన్యత ఉందని, ఆ సమయానికి తెలంగాణను 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడమే తమ ప్రభుత్వ లక్ష్యమని సీఎం స్పష్టం చేశారు.రాష్ట్ర సమగ్రాభివృద్ధి కోసం తెలంగాణను మూడు ఆర్థిక జోన్లుగా (క్యూర్, ప్యూర్, రేర్) విభజించినట్లు ముఖ్యమంత్రి వివరించారు. ఔటర్ రింగ్ రోడ్ పరిధిలోని ప్రాంతాన్ని 'క్యూర్' గా పరిగణిస్తూ అక్కడ సేవా రంగాలకు (సర్వీస్ సెక్టార్), ఓఆర్ఆర్ నుంచి రీజినల్ రింగ్ రోడ్ వరకు ఉన్న ప్రాంతాన్ని 'ప్యూర్' గా విభజిస్తూ తయారీ రంగానికి, ఇక ఆర్ఆర్ఆర్ వెలుపల ఉన్న ప్రాంతాన్ని 'రేర్' గా గుర్తిస్తూ వ్యవసాయం, వ్యవసాయ ఆధారిత పరిశ్రమలకు పెద్దపీట వేస్తున్నట్లు తెలిపారు. తమ ప్రభుత్వంలో రహదారులు, భవనాలశాఖ అనేక కీలక మౌలిక వసతుల పనులను చేపడుతోందని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. రహదారులతో పాటు వైద్య రంగానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని, రాష్ట్రంలో నూతన ఉస్మానియా ఆసుపత్రి, టిమ్స్ తదితర ఆసుపత్రుల ద్వారా కొత్తగా 8,000 పడకలను అందుబాటులోకి తెస్తున్నామని చెప్పారు. దేశ భద్రత, జాతి ప్రయోజనాల



విషయంలో రాజకీయాలకు తావులేదని, రాజకీయాలు కేవలం ఎన్నికల సమయంలో మాత్రమే ఉండాలని వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనుల గురించి మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఇప్పటికే వివరించారని, వాటికి కేంద్రం, నిపుణులు సంపూర్ణ మద్దతు ఇవ్వాలని కోరారు. ఇక.. రాష్ట్రంలోకి భారీగా పెట్టుబడులను ఆకర్షించేందుకు డిసెంబరు 7, 8, 9 తేదీల్లో 'ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్' నిర్వహించబోతున్నట్లు సీఎం ప్రకటించారు. దేశాభివృద్ధిలో, పెట్టుబడుల సాధనలో ఈ సదస్సు అత్యంత కీలకం కానుందని పేర్కొంటూ, సదస్సుకు హాజరుకావాల్సిందిగా అతిథులందరినీ ముఖ్యమంత్రి ఆహ్వానించారు.

ప్రభుత్వ భూములు అమ్మొద్దు.. ప్రజా అవసరాలకే కేటాయించాలి....



హైదరాబాద్, ప్రభుత్వ భూములు ప్రజల ఆస్తులని, వాటిని విక్రయించి సొమ్ము చేసుకోవడం కాకుండా ప్రజా అవసరాలకు వినియోగించాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు డిమాండ్ చేశారు. మియాపూర్ సర్వే నంబర్లు 100, 101లోని సుమారు 550 ఎకరాల ప్రభుత్వ భూములను విక్రయించాలన్న ప్రభుత్వ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని కోరారు.ఈ మేరకు బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, శేరిలింగంపల్లి నియోజకవర్గ ఇన్‌ఛార్జి రవికుమార్ యాదవ్, జిల్లా అధ్యక్షుడు వనిపల్లి శ్రీనివాస్‌రెడ్డితో కలిసి ఎం.ఏ. నగర్ కాలనీని సందర్శించి, ఇళ్లు కోల్పోయే ప్రమాదం ఎదుర్కొంటున్న బాధితులతో మాట్లాడారు. అనంతరం నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. సుప్రీంకోర్టు తీర్పుతో ప్రభుత్వానికి దక్కిన విలువైన భూములను రియల్ ఎస్టేట్ వ్యాపారుల ప్రయోజనాల కోసం విక్రయించాలని చూడటం సరికాదన్నారు.మిగిలిన సుమారు 400 ఎకరాల్లో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి, ప్రభుత్వ పాఠశాలలు, డిగ్రీ, ఇంజినీరింగ్ కళాశాలలు, పార్కులు ఏర్పాటు చేయడంతోపాటు నిరుపేదలకు పక్కా ఇళ్లు నిర్మించాలని సూచించారు. తరతరాలుగా నివసిస్తున్న పేదల ఇళ్లను తొలగిస్తే సహించబోమని హెచ్చరించారు. ప్రజాభిప్రాయ సేకరణ ద్వారా సంతకాలు సేకరించి ముఖ్యమంత్రి, గవర్నర్‌కు వినతిపత్రాలు అందజేస్తామని తెలిపారు. ప్రభుత్వం వెనక్కి తగ్గకపోతే శేరిలింగంపల్లి నుంచే ఉద్యమం ప్రారంభించి రాష్ట్రవ్యాప్త పోరాటం చేపడతామని రామచంద్రరావు స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో జాతీయ కార్యవర్గ సభ్యురాలు సింధు రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రవీందర్ రావు, రాష్ట్ర మహిళా మోర్చా కార్యదర్శి పద్మ, జిల్లా ప్రధాన కార్యదర్శి మహిపాల్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు రాధాకృష్ణ యాదవ్, ఓబీసీ మోర్చా అధ్యక్షులు సీతారామ రాజు,ఎస్టీ మోర్చా జిల్లా అధ్యక్షులు విజయేందర్ సింగ్, కార్యదర్శి మాణిక్ రావు, రాష్ట్ర నాయకులు నాగేశ్వర్ గౌడ్, రాఘవేంద్ర రావు, వసంత్ యాదవ్,నరేష్, టాక్ సభ్యులు బుచ్చి రెడ్డి, జిల్లా కౌన్సిల్ మెంబర్ గణేష్ ముదిరాజ్, రమేష్ డివిజన్ అధ్యక్షులు లక్ష్మణ్, శ్రీనివాస్,కృష్ణ, వేణుగోపాల్ రెడ్డి, రాజు యాదవ్, రవి నాయక్, కిషోర్ , స్థానిక నాయకులు మన్యం, బాలు, ముకేష్, కిరణ్ , మరియు రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ, డివిజన్ నాయకులు, పదాధికారులు, వివిధ మోర్చల నాయకులు, పదాధికారులు, కార్యకర్తలు మరియు కాలనీ వాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

రేవంత్‌కు కాంగ్రెస్ అధిష్టానం బుద్ధి చెప్పాలి: హరీశ్ రావు



హైదరాబాద్, భూముల అమ్మకం విషయంలో సీఎం రేవంత్ రెడ్డికి కాంగ్రెస్ అధిష్టానం చొరవ చూపి బుద్ధి చెప్పాలని మాజీ మంత్రి హరీశ్ రావు డిమాండ్ చేశారు. ప్రభుత్వ రంగ సంస్థలను, ప్రభుత్వ భూములను అమ్మొద్దని రాహుల్ గాంధీ చెబుతుంటే.. రేవంత్ రెడ్డి మాత్రం అందుకు విరుద్ధంగా అదే పనిగా భూములను అమ్ముతున్నారని విమర్శించారు. రాహుల్ గాంధీ మాటకు విలువ లేదా అని కాంగ్రెస్ పార్టీ ఆలోచించుకోవాలని, లేకుంటే రాష్ట్రంలో కాంగ్రెస్ నామరూపాలు లేకుండా పోతుందని హెచ్చరించారు. గురువారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో కూకట్‌పల్లి ట్రక్ పార్కింగ్ భూమి అమ్మకాన్ని వ్యతిరేకిస్తూ వామపక్ష పార్టీలు నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో హరీశ్ రావు పాల్గొని మాట్లాడారు.

భూముల చుట్టే రేవంత్

సూర్యుడి చుట్టూ భూమి తిరిగినట్లు, సీఎం రేవంత్ రెడ్డి ఎప్పుడూ భూముల చుట్టే తిరుగుతున్నారని హరీశ్ రావు సెటైర్ వేశారు. సీఎం పాలనపై కంటే భూముల అమ్మకంపైనే ఎక్కువ శ్రద్ధ పెట్టడం దురదృష్టకరమన్నారు. గత ప్రభుత్వాలు ప్రజలకు ఉపయోగపడని నిరర్థక ఆస్తులను మాత్రమే విక్రయించేవని, కానీ రేవంత్ ప్రభుత్వం మాత్రం ప్రజోపయోగ భూములను సైతం అమ్మకానికి పెడుతోందని దుయ్యబట్టారు. గ్యారెంటీల అమలును మరిచిపోయి, భూములను మాత్రం గ్యారెంటీగా అమ్ముతున్నారని విమర్శించారు. ఇప్పటికే 26 వేల ఎకరాల భూమిని అమ్మారని, మరో 20 వేల ఎకరాల భూమిని బాంబే స్టాక్ ఎక్స్ఛేంజీలో కుదువ పెట్టి బ్రోకర్‌కు రూ. 500 కోట్ల లంచం ఇచ్చి రూ. 20 వేల కోట్లు అప్పు తెచ్చారని హరీశ్ రావు తీవ్ర ఆరోపణలు చేశారు. భూముల విక్రయాలు, అప్పుల సమీకరణలో బ్రోకర్లకు భారీగా కమీషన్లు చెల్లించారంటూ పలు ఆరోపణలు చేశారు.

ట్రక్ పార్కింగ్ భూమిని ఎలా అమ్ముతారు?

కూకట్‌పల్లి ట్రక్ పార్కింగ్ భూమి సాధారణ ప్రభుత్వ భూమి కాదని, ప్రత్యేక ప్రజా ప్రయోజనం కోసం సేకరించిన భూమి అని హరీశ్ రావు పేర్కొన్నారు. ప్రభుత్వ రికార్డుల్లోనూ ట్రక్ పార్కింగ్ అవసరాల కోసమే సేకరించినట్లు ఉందన్నారు. భూసేకరణ చట్టం ప్రకారం నిర్దేశిత ప్రయోజనం నెరవేరకపోతే తిరిగి రైతులకు అప్పగించాల్సి ఉంటుందని గుర్తు చేశారు. ఇష్టారీతిగా విక్రయించడం సాధ్యం కాదని, ట్రక్ పార్కింగ్ భూమిని వేలం వేయాలన్న నిర్ణయాన్ని తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. రోజుకు వెయ్యి కంటైనర్లు లోడ్ అయ్యే ఈ ట్రక్ పార్క్‌ను అమ్మితే వేలాది మంది కార్మికుల జీవితాలు రోడ్డున పడతాయని ఆందోళన వ్యక్తం చేశారు.రాష్ట్ర ప్రభుత్వం హెచ్‌సీయూ, ఉర్దూ యూనివర్సిటీ, అసైన్డ్ భూములతో పాటు దేవాలయ, పర్యావరణ భూములను కూడా విక్రయానికి పెడుతున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో ఎక్కడ భూమి కనిపించినా అమ్మకానికి సిద్ధమవుతున్నారని విమర్శించారు.

బీఆర్ఎస్ నేతలకు మాటలే ఎక్కువ.. పని తక్కువ: మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి



సూర్యాపేట: బీఆర్ఎస్ నేతలకు మాటలు ఎక్కువ.. పని తక్కువ అని రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి నలమాద ఉత్తమ్ కుమార్ రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ప్రజలకు ఉపయోగపడే పనులు చేయడం చేతకాక పిచ్చిపిచ్చి మాటలతో ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని మండిపడ్డారు. ప్రపంచవ్యాప్తంగా ఎలినో ప్రభావంతో ఏర్పడిన కరువు పరిస్థితులను కాంగ్రెస్ ప్రభుత్వానికి అంటగడుతూ బీఆర్ఎస్ నేతలు తప్పుడు ప్రచారానికి తెరలేపారని ఆగ్రహం వ్యక్తం చేశారు.గురువారం సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్‌లో లబ్ధిదారులకు పింఛన్లు, సీఎం రిలీఫ్ ఫండ్, కల్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి బీఆర్ఎస్‌పై తీవ్ర విమర్శలు చేశారు. తమది మాటల ప్రభుత్వం కాదని.. ప్రజల కోసం పనిచేసే ప్రజా ప్రభుత్వమని స్పష్టం చేశారు. అధికారంలోకి వచ్చిన మూడేళ్లలోనే అనేక సంక్షేమ పథకాలను అమలు చేసి ప్రజలకు అండగా నిలిచామని పేర్కొన్నారు.పదేళ్లు అధికారంలో ఉండి ఒక్క కొత్త రేషన్ కార్డు కూడా ఇవ్వని బీఆర్ఎస్ నేతలు ఇప్పుడు తమ ప్రభుత్వాన్ని విమర్శించడం విడ్డూరంగా ఉందని ఉత్తమ్ ఎద్దేవా చేశారు. తమ ప్రభుత్వం అర్హులైన ప్రతి ఒక్కరికీ తెల్ల రేషన్ కార్డులు అందించడంతో పాటు దేశంలో ఎక్కడా లేని విధంగా సన్నబియ్యం పంపిణీ



సంపాదకీయం

శుక్రవారం 20-11-2026

ఏఐ... ఇక ఇంట్లోకి

ఏఐతో ఎన్నో పనులు చేసుకుంటున్నాం. ఆయా పనులుగానో, టెక్ట్ రూపంలోనో మాత్రమే ఏఐ మనకు కనిపిస్తోంది. అలాకాకుండా దానికో రూపం ఇస్తే..? ఆ ఆలోచనను కార్యరూపంలోకి తెచ్చే పని ఇప్పుడు శరవేగంగా జరుగుతోంది. త్వరలోనే ఏఐ శక్తి కలిగిన హ్యూమనాయిడ్ రోబోలు మనుషుల్లా మనతో కలిసి తిరుగుతూ ఇంట్లో పనులన్నీ చక్కబెట్ట బోతున్నాయి. తాము చేసే పనులన్నీ వాటికి నేర్పించడంలో ఇప్పటికే ప్రపంచవ్యాప్తంగా లక్షలాది మంది బిజీగా ఉన్నారు.ఇల్లు తుడిచే రోబోల గురించి విన్నాం. చాలామంది ఇళ్లలో ఇప్పటికే వీటిని వాడుతున్నారు. ఆన్ చేయగానే తనంతట తనే ఇల్లంతా తిరుగుతూ శుభ్రంగా ఊడ్చి, తుడిచేస్తుంది. పదిహేను వేల రూపాయలతో మొదలుపెట్టి లక్షన్నర వరకు ఖరీదు చేసే హోమ్ వ్యాక్యూమ్ క్లీనర్ రోబోలు అందుబాటులో ఉన్నాయి. ఆన్‌లైన్‌లో వాటి రివ్యూలు చూస్తే– 'చాలా బాగుంది, పనిమనిషి వస్తుందా రాదా అన్న దిగులు లేదు. మోకాళ్ల నొప్పులతో ఇల్లు ఊడ్చి తుడవలేను, ఇది కొన్నాక హాయిగా ఉంది. ఉద్యోగినులకు, వృద్ధులకు చాలా సౌకర్యంగా ఉంటుంది. మిగతా ఇంటి పనులు చేసే రోబోలు కూడా వస్తే బాగుంటుందని ఎదురుచూస్తున్నాం...' కొనుక్కున్నవారి స్పందనల సారాంశం ఇది. త్వరలోనే వీరి కోరిక తీరుతుందనిపిస్తోంది టెక్ కంపెనీల వేగం చూస్తుంటే. ఫిగర్ ఏఐ సంస్థ తయారుచేసిన 'ఫిగర్ 3' హ్యూమనాయిడ్ రోబో అచ్చం మనిషిలా 5.8 అడుగుల పొడవు ఉంటుంది. వాషింగ్‌మెషీన్ వేయడం, ఇల్లు శుభ్రంచేయడం, డిష్‌వాషర్‌తో పాత్రలు కడగడం లాంటివన్నీ చేస్తుంది. ఏ పనైనా చెప్పి చేయించుకోవచ్చు. 1ఎక్స్ టెక్నాలజీస్ సంస్థ 'నియో' అనే రోబోను తయారుచేస్తోంది. ఇది కూడా ఇంటిపనులన్నీ చేస్తుంది. టీ కూడా పెడుతుంది. ఇప్పుడు వీటి ధర ఇరవై వేల డాలర్లనుంచి లక్ష డాలర్ల వరకూ ఉంది. ప్రస్తుతం ఇళ్లలో వాడుతున్న క్లీనింగ్ రోబోల మార్కెట్ విలువే మనదేశంలో రూ.2,400 కోట్ల వరకూ ఉంటుందని అంచనా. 24.9 శాతం వార్షిక పెరుగుదలతో 2030 నాటికి అది దాదాపు రూ.13వేల కోట్లకు చేరుతుందని భావిస్తున్నారు. ఇప్పుడీ రోబోలకు స్వాగతం పలకడానికి స్థిరాస్తి రంగమూ సిద్ధమవుతోంది. వాటి కదలికలకు అనువుగా ఉండేలా ఇళ్ల నిర్మాణంలో తగిన మార్పులు చేస్తున్నారంటే– ఆఫీసుల్లోనేకాదు, ఇక ఇళ్లలోనూ ఏఐ రాజ్యమేలబోతోందన్న మాట.

వీడియోలే పాఠాలు

చాట్‌బాట్స్‌ని టెక్ట్‌తో ట్రెయిన్ చేసినట్లు హ్యూమనాయిడ్ రోబోలకు మనుషుల కదలికలతో శిక్షణ ఇవ్వాలి. ఆయా పనులను అవి ఇంట్లో మనిషి చేసినట్లే చెయ్యాలి కాబట్టి ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా కొన్ని లక్షలమంది, తలకు ఫోన్లు తగిలించుకుని తాము చేసే పనులను వీడియో రికార్డు చేస్తున్నారు. మనదేశంలోనూ పలు రాష్ట్రాల్లో ఈ పని జోరుగా సాగుతోంది. మనిషికైతే చెప్పి నేర్పించవచ్చు. మిషన్లకెలా నేర్పడం? అందుకో పెద్ద ప్రాసెస్ ఉంది. రోబో టీ పెట్టగలగాలంటే– మనిషి టీ పెడుతున్న వీడియోలు కొన్ని లక్షల గంటల ఫీడ్ కావాలి. అలాగే వాటితో చేయించాలనుకుంటున్న ప్రతి పనికీ కావాలి. అందుకే పంట, కూరగాయలు తరగడం, ఇల్లు శుభ్రంచేయడం, తోటపని... లాంటివన్నీ మహిళలు తలకు ఫోన్లను బెల్టుతో బిగించుకుని వీడియో రికార్డు చేస్తున్నారు. అలా చేసిన వీడియోలు స్థానిక వెండర్ కంపెనీల ద్వారా డేటా ఎగ్రిగేషన్ కంపెనీలకు వెళ్తాయి. వీటినే డేటా కలెక్షన్ స్టార్టప్స్ అనీ అంటారు. ఇక్కడ వీడియోలను క్లీన్ చేసి, లేబుల్ చేసి, స్ట్రక్చర్డ్ డేటా సెట్‌గా మార్చి విదేశాల్లోని పెద్ద రోబోటిక్ కంపెనీలకు పంపుతారు. ఆ డేటాను ఉపయోగించుకునే ఫిగర్ ఏఐ లాంటి కంపెనీలు హ్యూమనాయిడ్ రోబోలకు శిక్షణ ఇస్తున్నాయి.

అటు శ్రమ... ఇటు వినియోగం

కొన్నివేల మంది భారతీయ మహిళలు ఇప్పుడు తమ ఇళ్ల నుంచి వీడియో రికార్డింగ్ పని చేస్తున్నారు. వీరిలో చాలామంది దిగువ మధ్య తరగతి, పేద కుటుంబాల మహిళలు. కొందరు పనిమనుషులుగా ఇళ్లలో పనిచేసేవారు. ఇంటినుంచి పనిచేసే అవకాశంగా భావించి దీనికి అంగీకరిస్తున్నారు. కొన్ని వెండర్ కంపెనీలు ప్రత్యేకంగా స్టూడియోలు నెలకొల్పి అక్కడ రికార్డు చేస్తున్నాయి. ఏయే పనులు రికార్డు చేయాలో ఒక టాస్క్ లిస్ట్ ఇస్తారు వీళ్లకు. వాటిలో తమకు చేతనైనవి చేసి ఇవ్వవచ్చు. రికార్డు చేసినంత సేపు నిలబడే ఉండాలి. ఏ పనీ పావుగంటకు తక్కువ ఉండకూడదు. వీడియో నిడివిని బట్టి గంటకు ఇంతని చెల్లిస్తాయి వెండర్ కంపెనీలు. అది పాతిక రూపాయల నుంచి రూ.250 వరకు ఎంతైనా ఉండవచ్చు. రికార్డింగ్ సరిగా లేక వీడియో రిజెక్ట్ అయితే సమయం, కష్టం రెండూ వృథానే. టాస్క్ బేస్డ్ పని కాబట్టి గిగ్ వర్క్, డిజిటల్ లేబర్ కాబట్టి డేటా, ఇంటి నుంచి చేస్తారు కాబట్టి హోంబేస్డ్ వర్క్... ఇన్ని పేర్లున్న ఈ పని ఏ శ్రామిక చట్టాల కేటగిరీలోకీ రాదు. దాంతో కనీసవేతనం, బీమాలాంటి రక్షణలేమీ ఈ మహిళలకు ఉండవు. చౌక మానవవనరులు, భారీ మార్కెట్‌తో ఆకర్షణీయంగా కనిపిస్తుండటంతో పెద్ద ఏఐ సంస్థల దృష్టి ఇండియాపై పడింది. మనదేశం ఇప్పుడు ఈ గొలుసులో రెండు కొసలా ఉంది... మొదటి శ్రమ మనదే, చివరి వినియోగదారులమూ మనమే. 2050 నాటికి వంద కోట్ల రోబోలు వాడుకలో ఉంటాయని మార్కెట్ అంచనా. 'ఇంటి పని లెక్కలోకి రాని చాకిరీ. రోబోలే ఆ పనులన్నీ చేస్తే భలే హాయి కదా' అనుకుంటూ ఉంటారట వీడియోలు రికార్డు చేసే మహిళలు. నిజమే... రోబోలు వస్తాయి, కాకపోతే పని పోతుంది... అదే అసలు సమస్య! ఇల్లయినా ఫ్యాక్టరీ అయినా, ఏఐ కోసం తాము చేస్తున్న పనుల్ని వీడియో తీస్తూ ఉపాధి పొందుతున్న వారిలో పలువురు ఇవాళ పని దొరికినందుకు సంతోషిస్తున్నారు కానీ... తమ వేలితో తమ కన్నే పొడుచుకుంటున్నామని గుర్తించడం లేదు. రేపు ఆ రోబోలు తక్కువ ధరకే విస్తృతంగా మార్కెట్లోకి వస్తే అసంఘటిత రంగ ఉపాధి అవకాశాలపై తీవ్ర ప్రభావం ఉంటుందన్నది వాస్తవం.

మైక్రోసాఫ్ట్ నేర్పిన గుణపాఠం

సాంకేతిక పరిజ్ఞానం మనిషి జీవితాన్ని ఎంతగా సులభతరం చేస్తోందో, దానిపై అతిగా ఆధారపడితే అంతగానూ సంక్షోభానికి దారితీయగలదని మైక్రోసాఫ్ట్ లో ఇటీవల తలెత్తిన సాంకేతిక లోపం నిరూపించింది. ప్రపంచవ్యాప్తంగా కోట్లాది వినియోగదారులు ఉపయోగించే మైక్రోసాఫ్ట్ సేవలు కొన్ని గంటలపాటు నిలిచిపోవడంతో ప్రభుత్వ కార్యాలయాలనుంచి ప్రైవేటు సంస్థల వరకు అనేక రంగాలు తీవ్ర అంతరాయాన్ని ఎదుర్కొన్నాయి. ఈ- మెయిళ్లు పంపడం, స్వీకరించడం, ఆన్‌లైన్ సమావేశాలు నిర్వహించడం, సమాచారాన్ని బదిలీ చేయడం వంటి నిత్యావసర కార్యకలాపాలు స్తంభించిపోయాయి. నవంబరు 12న మొదలైన ఈ అంతరాయం మరుసటి రోజు వరకు కొనసాగింది. 70కి పైగా దేశాల్లో వినియోగదారులు సమస్యలను ఎదుర్కొన్నారు. మైక్రోసాఫ్ట్ 365లో భాగమైన ఔట్‌లుక్, ఎక్స్ఛేంజ్ ఆన్‌లైన్, టీమ్స్, కోపైలట్ వంటి సేవలు ఈ అంతరాయం కారణంగా ప్రభావితమయ్యాయి. మైక్రోసాఫ్ట్ సేవలను వినియోగించుకునే 43కోట్ల మందికిపైగా ప్రజలు, సంస్థలపై దీని ప్రభావం పడింది.ఒక దశలో నెట్‌వర్క్ గేట్‌వే సర్వర్లలో 80 శాతానికి పైగా స్పందించకుండా నిలిచిపోయినట్లు మైక్రోసాఫ్ట్ తన ప్రాథమిక నివేదికలో వెల్లడించింది. సైబర్ దాడి కారణంగా ఈ సమస్య తలెత్తలేదని సంస్థ స్పష్టం చేసింది. అయితే, ఒక చిన్న సాంకేతిక లోపం ప్రపంచవ్యాప్తంగా సంక్షోభం సృష్టించడం వ్యవస్థల నిర్వహణలోని లోపాలను ప్రశ్నిస్తోంది. ఈ అంతరాయం ప్రభావం కేవలం వ్యక్తిగత వినియోగదారులకే పరిమితం కాలేదు. బ్రిటన్‌లోని కొన్ని పోలీసు విభాగాలు ఆన్‌లైన్‌లో ఫిర్యాదులను స్వీకరించడంలో ఇబ్బందులు ఎదుర్కొన్నాయి. ఆరోగ్య సేవలకు సంబంధించిన ఈ-మెయిళ్లు నిలిచిపోవడంతో ఔషధాల ప్రిస్క్రిప్షన్ల పంపిణీలో జాప్యం ఏర్పడింది. మాంచెస్టర్‌లో ఒక న్యాయ విచారణను సైతం వాయిదా వేయాల్సి వచ్చింది. జపాన్, సింగపూర్, ఆస్ట్రేలియా ప్రభుత్వ కార్యాలయాల్లోనూ సమాచార మార్పిడికి ఆటంకాలు ఏర్పడ్డాయి. భారతదేశంలో ఇండిగో, ఎయిరిండియా సంస్థల ఈ- మెయిల్ సేవలపైనా ప్రభావం పడింది. డిజిటల్ పరిజ్ఞానం విస్తరిస్తున్న కొద్దీ ప్రపంచం కొద్దిమంది సాంకేతిక సంస్థలపై మరింతగా ఆధారపడుతోంది. ప్రభుత్వాల సమాచార, బ్యాంకింగ్ లావాదేవీలు, వైద్య రికార్డులు, విద్యాసంస్థల కార్యకలాపాలు, పరిశ్రమల ఉత్పత్తి వ్యవస్థలు.. ఇలా దాదాపు ప్రతి రంగంలోనూ క్లౌడ్ సేవల వినియోగం పెరిగింది. ఈ సాంకేతిక సేవల వల్ల నిర్వహణ వ్యయం తగ్గడం, సమాచారాన్ని ఎక్కడి నుంచైనా అందుబాటులో ఉంచుకోవడం, పనుల వేగం పెరగడం వంటి ప్రయోజనాలున్నాయి.అయితే వీటిని అందించే సంస్థల్లో సాంకేతిక లోపం ఏర్పడితే దాని ప్రభావం ప్రపంచవ్యాప్తంగా ఒకేసారి కనిపిస్తోంది. పోటీ సంస్థల సేవలను ఉపయోగించుకునే అవకాశమున్నప్పటికీ, ఇప్పటికే ఒక వేదికలో సమాచారాన్ని నిక్షిప్తం చేసిన సంస్థలు మరో వ్యవస్థకు



మారడం అంత సులభం కాదు. సాఫ్ట్‌వేర్, హార్డ్ వేర్, ఉద్యోగుల శిక్షణ, సమాచార బదిలీ వంటి అంశాలు దీనికి అడ్డంకులుగా నిలుస్తున్నాయి. ఫలితంగా కొన్ని దిగ్గజ సంస్థల ఆధిపత్యం మరింత బలపడుతోంది. ఈ నేపథ్యంలో 2024 జులైలో జరిగిన క్రౌడ్‌స్ట్రైక్ ఘటనను కూడా గుర్తుచేసుకోవాలి. ఒక సాఫ్ట్ వేర్ అప్‌డేట్‌లోని లోపం కారణంగా ప్రపంచవ్యాప్తంగా లక్షలాది విండోస్ కంప్యూటర్లు ప్రభావితమై విమానయానం, బ్యాంకింగ్, వైద్య సేవలు సహా అనేక రంగాలు స్తంభించిపోయాయి. సాంకేతికత ఎంత అభివృద్ధి చెందినా, దాని నిర్వహణలో మానవ తప్పిదాలు, సాఫ్ట్ వేర్ లోపాలు, ముందస్తు అంచనాల్లో వైఫల్యాలు తప్పడం లేదన్నది స్పష్టమవుతోంది. ఈ పరిణామం భారత్‌కు కూడా ముఖ్యమైన హెచ్చరిక. డిజిటల్ ఇండియా, ఆన్‌లైన్ చెల్లింపులు, ప్రభుత్వ సేవల కంప్యూటరీకరణ, కృత్రిమ మేధ వినియోగం వంటి కార్యక్రమాలతో దేశం వేగంగా డిజిటల్ వ్యవస్థ వైపు అడుగులు వేస్తోంది.ఈ క్రమంలో విదేశీ సాంకేతిక సంస్థలపై ఆధారపడటం సహజమే అయినా, కీలక వ్యవస్థల నిర్వహణను పూర్తిగా వాటి చేతుల్లో పెట్టడం ప్రమాదకరం. ప్రభుత్వ శాఖలు, బ్యాంకులు, ఆసుపత్రులు, విమానయాన సంస్థలు తమ సమాచారానికి ప్రత్యామ్నాయ వ్యవస్థలను ఏర్పాటు చేసుకోవాలి. అత్యవసర పరిస్థితుల్లో ఇంటర్నెట్‌తో సంబంధం లేకుండానే పనిచేసే వ్యవస్థలు, సమాచారాన్ని భద్రపరిచే ఆఫ్‌లైన్ ఏర్పాట్లు కూడా తప్పనిసరి కావాలి. స్వదేశీ సాఫ్ట్‌వేర్ అభివృద్ధికి ప్రోత్సాహమివ్వడంతోపాటు, అంతర్జాతీయ సంస్థల సేవలను వినియోగించుకునే విషయంలోనూ తగిన నియంత్రణలు, జవాబుదారీతనం ఉండాలి. సాంకేతికతపై ఆధారపడటం తప్పనిసరే అయినా, దానికి ప్రత్యామ్నాయాలను సిద్ధం చేసుకోవడం కూడా అంతే అవసరం. డిజిటల్ పురోగతి అంటే సౌకర్యాల విస్తరణ మాత్రమే కాదు.. సంక్షోభాలను తట్టుకోగల సామర్థ్యాన్ని పెంపొందించుకోవడం కూడా. మైక్రోసాఫ్ట్ వైఫల్యం ప్రపంచ దేశాలకు నేర్పుతున్న ప్రధాన పాఠం ఇదే.

రాష్ట్రంలో సబ్సిడీ విత్తనాలు ఎక్కడ.. దిక్కుతోచని స్థితిలో అన్నదాతలు!



హైదరాబాద్,యాసంగి సాగుకు రైతులు సన్నద్ధమవుతున్నారు. దక్షిణ తెలంగాణలోని పలు ప్రాంతాల్లో ఇప్పటికే వరినార్లు అలుకుతున్నారు. మరికొన్ని ప్రాంతాల్లో పొలాలను సిద్ధం చేసుకుంటున్నారు. విత్తనాలు, ఎరువుల కోసం ముందస్తు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. మరోవైపు ప్రభుత్వం మాత్రం వరికి బదులుగా ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలని రైతులకు సూచిస్తోంది. పప్పుధాన్యాలు, నూనెగింజల సాగును ప్రోత్సహించాలని వ్యవసాయశాఖ అధికారులకు ఆదేశాలిస్తోంది. కానీ క్షేత్రస్థాయిలో పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది. ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలనుకున్న రైతులకు అవసరమైన విత్తనాలే అందుబాటులో లేవు. జింక్, పెసర విత్తనాలు మినహా ఇతర పంటలకు సంబంధించి సబ్సిడీ విత్తనాల సరఫరాపై స్పష్టత కనిపించడం లేదు. ఒకవైపు సాగు సమయం సమీపిస్తుండగా.. మరోవైపు విత్తనాల కోసం రైతులు ఎదురుచూడాల్సి వస్తోంది. ప్రత్యామ్నాయ సాగుపై ప్రభుత్వ ప్రకటనలకు, క్షేత్రస్థాయిలో విత్తనాల లభ్యతకు మధ్య పొంతన లేకపోవడంతో అన్నదాతలు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు.

విత్తనాలేవి?

రాష్ట్రంలో యాసంగి సాగులో వరి విస్తీర్ణాన్ని తగ్గించి ప్రత్యామ్నాయ పంటలను ప్రోత్సహించాలని ప్రభుత్వం భావిస్తోంది. నీటి వినియోగం తక్కువగా ఉండే పంటలతోపాటు పప్పుధాన్యాలు, నూనెగింజల సాగుపై దృష్టి సారించాలని సూచిస్తోంది. రైతులు కూడా కొంతమేర ప్రత్యామ్నాయ పంటల సాగుకు ఆసక్తి చూపుతున్నారు. అయితే ఆయా పంటలకు అవసరమైన విత్తనాలు మాత్రం అందుబాటులో లేకపోవడం సమస్యగా మారింది. జింక్, పెసర విత్తనాలు మినహా ఇతర పంటలకు సబ్సిడీ విత్తనాల పంపిణీపై స్పష్టత కరవైంది. శనగ, మినుము, వేరుశనగ తదితర పంటలు సాగు చేయాలనుకునే రైతులకు విత్తనాలు ఎప్పుడు అందుతాయో తెలియని పరిస్థితి నెలకొంది. ప్రైవేటు మార్కెట్లో కొనుగోలు చేయాలంటే అధిక ధరలు చెల్లించాల్సి వస్తుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఇంకా యాప్‌లోనే ఇండెంట్!

యాసంగి సీజన్‌కు సంబంధించి విత్తనాల అవసరాలను గుర్తించే ప్రక్రియ ఇంకా కొనసాగుతున్నట్లు తెలుస్తోంది. రైతులు ఏయే పంటలు సాగు చేయాలనుకుంటున్నారు? ఎంత విస్తీర్ణంలో సాగు చేస్తారు? ఎంత మొత్తంలో విత్తనాలు అవసరం? అనే వివరాలను వ్యవసాయశాఖ అధికారులు యాప్‌లో నమోదు చేయాలని సూచిస్తున్నారు. ఈ వివరాల ఆధారంగా విత్తనాల ఇండెంట్ రూపొందించి ఉన్నతాధికారులకు పంపించాల్సి ఉంటుంది. విత్తనాల కేటాయింపు, సరఫరా, పంపిణీ ప్రక్రియ చేపట్టాల్సి ఉంది. ప్రస్తుతం మండల కేంద్రంలో పెసల్లు మాత్రమే ఉన్నట్లు అధికారులు పేర్కొంటున్నారు. అయితే ఇప్పటికే దక్షిణ తెలంగాణలో వరినార్లు అలుకుతున్న సమయంలో కూడా ఇండెంట్ నమోదు ప్రక్రియ కొనసాగుతుండటంపై రైతుల్లో అసహనం వ్యక్తమవుతోంది. ఇండెంట్ పూర్తయి, విత్తనాల కేటాయింపు జరిగి, అవి రైతులకు చేరేలోగా మరెంత సమయం పడుతుందోనని ఆందోళన చెందుతున్నారు.

సాగు సమయం దాటితే ఇబ్బందులే!

ప్రతి పంటకు విత్తనాలు వేసేందుకు అనువైన సమయం ఉంటుంది. సాగుకు కార్తెల ప్రభావం ఎక్కువగా ఉంటుంది. వాటిని బట్టే సాగుచేస్తుంటారు. ఆ సమయంలో విత్తనాలు అందకపోతే సాగు ప్రణాళిక దెబ్బతినడమే కాకుండా దిగుబడిపైనా ప్రభావం పడే ప్రమాదం ఉంది. ప్రత్యామ్నాయ పంటలు వేయాలనుకునే రైతులు విత్తనాల కోసం ఎదురుచూస్తూ విలువైన సమయాన్ని కోల్పోతున్నారు. సమయానికి విత్తనాలు అందకపోతే చివరకు వరి సాగు వైపు వెళ్లాలా? లేక ప్రైవేటు మార్కెట్లో అధిక ధరలకు విత్తనాలు కొనుగోలు చేసి ప్రత్యామ్నాయ పంటలు వేయాలా? అన్న సందిగ్ధంలో పడుతున్నారు. సబ్సిడీ విత్తనాల కోసం ఆశగా ఎదురుచూస్తున్న రైతులకు నిరాశే మిగులుతోంది.

ప్రచారానికి.. ఆచరణకు పొంతనేది?

ప్రత్యామ్నాయ పంటల సాగుతో రైతులకు ప్రయోజనం చేకూరుతుందని చెబుతున్న ప్రభుత్వం.. అందుకు అవసరమైన విత్తనాల సరఫరాపై ముందస్తు చర్యలు తీసుకోవడంలో విఫలమైందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. పంటల మార్పిడి గురించి గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్న అధికారులు.. రైతులకు అవసరమైన విత్తనాలు ఎప్పుడు అందిస్తారన్న దానిపై మాత్రం స్పష్టమైన సమాచారం ఇవ్వడం లేదు. ప్రత్యామ్నాయ పంటలు వేయాలని చెప్పడం ఎంత ముఖ్యమో.. వాటికి అవసరమైన నాణ్యమైన విత్తనాలను సకాలంలో అందించడం అంతకంటే ముఖ్యమని రైతులు పేర్కొంటున్నారు. ప్రభుత్వం ఒకవైపు వరి సాగును తగ్గించాలని చెబుతుంటే.. మరోవైపు ప్రత్యామ్నాయ పంటలకు అవసరమైన సబ్సిడీ విత్తనాలు అందుబాటులో లేకపోవడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు.

రైతులకు భరోసా కల్పించేదెప్పుడు?

యాసంగి సీజన్ ప్రారంభానికి ముందే పంటల వారీగా విత్తనాల అవసరాలను అంచనా వేసి నిల్వలు సిద్ధం చేయాల్సిన వ్యవసాయశాఖ.. ఇంకా ఇండెంట్ ప్రక్రియలోనే ఉండటంపై రైతులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఏ పంటకు ఎంత విత్తనం అందుబాటులో ఉంది? ఏయే ప్రాంతాలకు ఎంత కేటాయించారు? పంపిణీ ఎప్పటి నుంచి ప్రారంభిస్తారు? అనే వివరాలను వెల్లడించాల్సి ఉంది. ప్రత్యామ్నాయ పంటల సాగుపై రైతుల్లో నమ్మకం కలగాలంటే ముందుగా సబ్సిడీ విత్తనాలను అందుబాటులోకి తేవాలని విజ్ఞప్తి చేస్తున్నారు. లేదంటే ప్రభుత్వం చెబుతున్న పంటల మార్పిడి క్షేత్రస్థాయిలో ఆచరణకు నోచుకోదని అంటున్నారు. యాసంగి సాగు ముంచుకొస్తున్న వేళ విత్తనాల కోసం రైతులు పడుతున్న ఎదురుచూపులకు వ్యవసాయశాఖ ఎప్పుడు తెరదించుతుందో చూడాలి. ప్రచారానికే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో విత్తనాలు అందించి ప్రత్యామ్నాయ సాగుకు భరోసా కల్పించాలని అన్నదాతలు కోరుతున్నారు.

ఏపీ ఆటో డ్రైవర్లకు శుభవార్త.. అకౌంట్లలోకి రూ.15 వేలు!

ఆంధ్రప్రదేశ్‌లోని ఆటో, ట్యాక్సీ డ్రైవర్లకు రాష్ట్ర ప్రభుత్వం తీపికబురు అందించింది. 2026-27 సంవత్సరానికి గాను 'ఆటో డ్రైవర్ల సేవలో' పథకం కింద ఆర్థిక సాయం అందించేందుకు నిధుల విడుదలకు ఆమోదం తెలిపింది. ఈ మేరకు వెనుకబడిన తరగతులకు చెందిన లబ్ధిదారుల కోసం రూ.231.13 కోట్లను విడుదల చేస్తూ బీసీ సంక్షేమ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. త్వరలోనే అర్హులైన డ్రైవర్ల బ్యాంకు ఖాతాల్లోకి రూ.15 వేల చొప్పున జమ చేయనున్నారు. సొంతంగా ఆటో, మోటార్ క్యాబ్, మ్యాక్సీ క్యాబ్ కలిగి ఉండి, దానిని నడుపుతూ జీవనం సాగించే యజమానులకు ఈ పథకం కింద ప్రభుత్వం ఏటా రూ.15,000 ఆర్థిక సాయం అందిస్తున్న విషయం తెలిసిందే. రాష్ట్రంలో మహిళల కోసం 'స్త్రీ శక్తి' పేరుతో ఉచిత బస్సు ప్రయాణ పథకాన్ని ప్రారంభించడంతో తమ ఆదాయం తగ్గిందని ఆటో, ట్యాక్సీ డ్రైవర్లు ఆవేదన వ్యక్తం చేశారు. వారిని ఆదుకునేందుకు ప్రభుత్వం ఈ పథకాన్ని అమలు చేస్తోంది. మేనిఫెస్టోలో హామీ ఇవ్వకపోయినా డ్రైవర్లకు మద్దతుగా నిలవాలనే ఉద్దేశంతో ఈ సాయం అందిస్తోంది. ఈ పథకానికి అర్హత ఉండి జాబితాలో పేరు లేనివారు ఫిర్యాదు

రాజమండ్రి అనంతపురం ఎవరిదో

రాజమండ్రి, రాజమండ్రి నగర పాలక సంస్థ ఎన్నికలు తీవ్ర ఉత్కంఠకు గురిచేస్తున్నాయి. ఎస్సీ జనరల్ కేటగిరీకి రిజర్వు చేసిన ఈ స్థానం నుంచి అధికార, ప్రతిపక్షాలు నువ్వానేనా అన్నట్లు తలపడేందుకు సిద్ధమవుతున్నాయి. కూటమి తరపున బీజేపీ మేయరు రేసులో నిలబడుతోందని అంటున్నారు. ఆ పార్టీ అభ్యర్థిగా మాజీ కార్పొరేటర్ రేలంగి శ్రీదేవి పేరు దాదాపు ఖరారైందని అంటున్నారు. ఇదే సమయంలో వైసీపీ తరపున కార్పొరేషన్ మాజీ ఉద్యోగి బర్రె కొండబాబు పేరు ప్రచారంలో ఉంది. అయితే బీజేపీ అభ్యర్థి శ్రీదేవి పేరు పట్ల కూటమిలో ప్రధాన భాగస్వామి అయిన టీడీపీ సానుకూలంగా లేదన్న టాక్ ఎక్కువగా ఉంది. ఆమెకు బదులుగా డాక్టర్ పిడుగు విజయకుమార్ పేరును సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు సిఫార్సు చేస్తున్నట్లుగా చెబుతున్నారు. దీంతో కూటమిలో అభ్యర్థి ఎంపికపై భిన్నాభిప్రాయాలు ఉన్నాయన్న ప్రచారం ఊపందుకుంది. ఈ పరిస్థితిని అనుకూలంగా మార్చుకునేందుకు వైసీపీ ప్రయత్నిస్తున్నారని అంటున్నారు. మొత్తానికి రాజమండ్రి కార్పొరేషన్ ఎన్నిక రసవత్తరంగా మారే సూచనలు కనిపిస్తున్నాయని పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు. పల్లెల్లో మొదలైన సందడి రాష్ట్రంలో రెండో విడత మున్సిపల్ సంగ్రామానికి తెర లేచింది. ఈ నెల 26న నాలుగు కార్పొరేషన్‌లతోపాటు 19 మున్సిపాలిటీలకు ఎన్నికలు జరగనున్నాయి. ఇందులో కాకినాడ, రాజమండ్రి, శ్రీకాకుళం, మంగళగిరి-తాడేపల్లి కార్పొరేషన్లు ఉన్నాయి. ఇందులో రెండు చోట్ల జనసేన, ఒక చోట టీడీపీ, మరోచోట బీజేపీ పోటీకి దిగుతున్నాయి. శ్రీకాకుళం, కాకినాడ కార్పొరేషన్లు జనసేన, మంగళగిరి-తాడేపల్లి నుంచి టీడీపీ పోటీకి రంగం సిద్ధం చేసుకుంటున్నాయి. రాజమండ్రిపై బీజేపీ ఎప్పుడో కర్చీఫ్ వేసింది. కేంద్ర మాజీ మంత్రి పురందరేశ్వరి ప్రాతినిధ్యం వహిస్తున్న రాజమండ్రి పార్లమెంటు పరిధిలో ఉన్న ఈ కార్పొరేషన్ దక్కించుకోవాలని ఎప్పటి నుంచో బీజేపీ పావులు కదుపుతోంది. అయితే ఆ పార్టీకి సంస్థాగతంగా పెద్దగా బలం లేదన్న ఆలోచనతో విపక్షం ఈ స్థానంపై గట్టిగా ఫోకస్ చేసింది. ఇదే సమయంలో అభ్యర్థి ఎంపికలో భిన్నాభిప్రాయాలు ఉన్నాయనే ప్రచారంతో వైసీపీలో ఆశలు పెరుగుతున్నాయని చెబుతున్నారు. నాలుగు కార్పొరేషన్లలో రాజమండ్రి తప్ప మరెక్కడా అభ్యర్థుల ఎంపికపై భిన్నాభిప్రాయాలు లేవని చెబుతున్నారు. మంగళగిరి - తాడేపల్లి కార్పొరేషన్‌లో కూటమి బలంగా ఉందన్న ప్రచారం ఎక్కువగా ఉంది. అదే సమయంలో కాకినాడలో కూడా జనసేన, టీడీపీ సంస్థాగతంగా బలంగా ఉన్నారని చెబుతున్నారు. దీంతో ఈ రెండు కార్పొరేషన్లపై కూటమి ప్రత్యర్థులు పెద్దగా ఫోకస్ చేయడం లేదని అంటున్నారు. అదే సమయంలో శ్రీకాకుళంలో కూటమిలో విభేదాల కారణంగా మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి వైసీపీలో చేరడం, ఆమె మేయరుగా పోటీకి దిగుతుండటంతో అక్కడ ఎన్నిక రసవత్తరంగా మారిందని చెబుతున్నారు. మరోవైపు రాజమండ్రిలో కూడా అనంతపురం కార్పొరేషన్ తరహా రాజకీయాలు నెలకొనడంతో వైసీపీలో ఆశలు పురుడుపోసుకుంటున్నాయి. అనంత కార్పొరేషన్లో టీడీపీ, బీజేపీ మధ్య సమన్వయం లోపించడంతో కేవలం 6 వేల ఓట్లతో బీజేపీ అభ్యర్థి ఓడిపోయారు. ఆ కార్పొరేషన్ లో బీజేపీకి సంస్థాగత బలం లేకపోవడం కూడా వైసీపీకి అడ్వాంటేజ్ అయిందని అంటున్నారు. ఇక రాజమహేంద్రవరంలోనూ ఇవే పరిస్థితులు ఉన్నాయని వైసీపీ నేతలు అభిప్రాయపడుతున్నారు. అభ్యర్థుల ఎంపిక, సంస్థాగత బలం విషయంలో తామే మెరుగ్గా ఉన్నామన్న ఆలోచన వైసీపీకి ఆశలు పెంచుతోందని అంటున్నారు. దీంతో కార్పొరేషన్ లో సుదీర్ఘకాలం ఉద్యోగిగా పనిచేసిన కొండబాబు పేరును వ్యూహాత్మకంగా తెరపైకి తెచ్చారని అంటున్నారు. పారిశుధ్యం, వాటర్ వర్క్స్ డిపార్టుమెంటులో పనిచేసిన కొండబాబు నగర ప్రజలకు సుపరిచితుడిగా పేర్కొంటున్నారు. దీనివల్ల తమకు అడ్వాంటేజ్ అయ్యే అవకాశాలు ఉన్నాయని వైసీపీ నేతలలో జోష్ కనిపిస్తోందని చెబుతున్నారు. మొత్తానికి బీజేపీకి కేటాయించిన ఈ స్థానాన్ని ఎలాగైనా గెలవాలనే లక్ష్యంతో వైసీపీ పావులు కదుపుతోందని అంటున్నారు. ఈ పరిస్థితుల్లో వైసీపీపై పైచేయి సాధించడానికి కూటమి నేతలు ఎలాంటి వ్యూహాలు రచిస్తారనేది ఆసక్తి రేపుతోంది.

పంచాయితీ పోరు...

నువ్వా, నేనా అన్నట్టు సాగుతున్న పోరు

కర్నూలు, ఏపీలో అర్బన్ బాడీస్ కి అలాగే పరిషత్తులకు ఎన్నికలు పూర్తి అయిపోయాయి. టీడీపీ కూటమి మంచి ఆధిక్యాన్ని కనబరచింది. వైసీపీ అయితే నైతిక విజయం తమదని చెప్పుకుంది. ఈ నేపధ్యంలో ఏపీ వ్యాప్తంగా 13 వేలకు పైగా గ్రామ పంచాయతీలకు ఎన్నికలు మూడు విడతలలో జరగబోతున్నాయి. ఈ నెల 26, 29, డిసెంబర్ 2 తేదీలలో ఎన్నికలు నిర్వహిస్తున్నారు. అయితే రాజకీయ పార్టీల ప్రమేయం ఏ మాత్రం లేని ఎన్నికలు ఇవి. అయితే పేరుకు ఇలా అనుకోవడం తప

జనవరి 1 నుంచి డిజిటల్ సేవలు

విజయవాడ, ఆంధ్రప్రదేశ్‌లో ప్రభుత్వ కార్యాలయాల పనితీరును పూర్తిగా మార్చే దిశగా కూటమి ప్రభుత్వం కీలక అడుగు వేస్తోంది. ప్రజలకు ప్రభుత్వ సేవలు మరింత వేగంగా, పారదర్శకంగా అందించడంతో పాటు కార్యాలయాల్లో కాగితాల వినియోగాన్ని తగ్గించాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా వచ్చే జనవరి 1 నుంచి పలు కీలక ప్రభుత్వ శాఖల్లో పూర్తిస్థాయి డిజిటల్ విధానాన్ని అమలు చేసేందుకు సిద్ధమవుతోంది. ఈ నిర్ణయం అమల్లోకి వస్తే ప్రభుత్వ కార్యాలయాల్లో ఫైళ్ల కదలిక నుంచి ప్రజల ఫిర్యాదుల పరిష్కారం వరకు అనేక పనులు ఆన్‌లైన్‌లోనే జరగనున్నాయి.ప్రస్తుతం ఏపీలో ప్రభుత్వ సేవలను ప్రజలకు చేరువ చేసేందుకు ఇప్పటికే అనేక సాంకేతిక మార్గాలను ఉపయోగిస్తున్నారు. మిత్ర యాప్) ద్వారా ప్రజలు తమ సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లే అవకాశం కల్పించారు. వివిధ శాఖలకు సంబంధించిన సేవలు, ఫిర్యాదుల స్వీకరణ, వాటి పరిష్కారానికి ఆన్‌లైన్ వ్యవస్థలను కూడా అందుబాటులోకి తీసుకొచ్చారు. అయినప్పటికీ ప్రభుత్వంలోని అనేక విభాగాల్లో ఇప్పటికీ పాత పద్ధతిలో కాగితాలపైనే కార్యకలాపాలు కొనసాగుతున్నాయి. ముఖ్యంగా అసెంబ్లీ, సచివాలయం వంటి కీలక వ్యవస్థల్లోనూ డిజిటల్ మార్పులు తీసుకురావాలని ప్రభుత్వం భావిస్తోంది.తొలుత ప్రజలతో నేరుగా సంబంధం ఉండే పోలీస్, రెవెన్యూ, అగ్నిమాపక, రవాణా శాఖల్లో ఈ విధానాన్ని విస్తృతంగా అమలు చేయనున్నారు. ప్రజలు ఇచ్చే దరఖాస్తులు, ఫిర్యాదులు, వాటిపై తీసుకునే చర్యలు అన్నీ డిజిటల్ రికార్డుల రూపంలో భద్రపరచాలని నిర్ణయించారు. అంతేకాకుండా ఆయా శాఖలు వసూలు చేసే ఫీజులు, జరిమానాలను కూడా ఆన్‌లైన్ చెల్లింపుల ద్వారానే స్వీకరించనున్నారు. దీనివల్ల నగదు లావాదేవీలు తగ్గి, ప్రజలకు కార్యాలయాల చుట్టూ తిరిగే అవసరం కూడా కొంతవరకు తగ్గే అవకాశం ఉంది. శాసనసభ కార్యకలాపాల్లోనూ సాంకేతికతను మరింతగా వినియోగించనున్నారు. ఎమ్మెల్యేలు అడిగే ప్రశ్నలు, వాటికి మంత్రులు ఇచ్చే సమాధానాలు, ప్రభుత్వ ఆదేశాలు వంటి సమాచారాన్ని డిజిటల్ రూపంలో నిర్వహించనున్నారు. ఇందుకోసం నేషనల్ ఈ-విధాన్ అప్లికేషన్ (ఔపఎం)ను ఉపయోగించనున్నారు. ఈ వ్యవస్థ ద్వారా శాసనసభకు సంబంధించిన సమాచారాన్ని ఒకే డిజిటల్ వేదికపై అందుబాటులో ఉంచే అవకాశం ఉంటుంది. దీనికి అనుగుణంగా అధికారులు, ఉద్యోగులకు ప్రత్యేక శిక్షణ కూడా ఇవ్వనున్నారు.ప్రభుత్వ శాఖల్లో అవినీతి ఆరోపణలు, ఫైళ్ల పరిష్కారంలో జాప్యం, ప్రజలకు సేవలు అందడంలో ఇబ్బందులు వంటి సమస్యలు చాలాకాలంగా చర్చకు వస్తున్నాయి. ముఖ్యంగా రెవెన్యూ, రవాణా, వాణిజ్య పన్నులు, పోలీస్ శాఖల్లో జరిగే లావాదేవీలపై పారదర్శకత పెరగాల్సిన అవసరం ఉంది. ప్రతి దరఖాస్తు, చెల్లింపు, నిర్ణయం ఆన్‌లైన్‌లో నమోదైతే వాటిని పరిశీలించడం సులభమవుతుంది. అయితే డిజిటల్ విధానం ప్రవేశపెట్టినంత మాత్రాన అవినీతి పూర్తిగా తగ్గిపోతుందని చెప్పలేం. వ్యవస్థను పర్యవేక్షించడం, తప్పులు జరిగినప్పుడు బాధ్యులపై చర్యలు తీసుకోవడం కూడా అంతే ముఖ్యం.మరోవైపు గ్రామీణ ప్రాంతాల్లో ఇంటర్నెట్ సదుపాయం, డిజిటల్ పరిజ్ఞానం లేని వారికి ప్రత్యామ్నాయ సహాయం అందించాల్సిన అవసరం ఉంది. సాంకేతికతతో పాటు సామాన్యులకు అందుబాటులో ఉండే సేవలు కొనసాగితేనే ఈ మార్పు విజయవంతమవుతుంది. కేవలం కార్యాలయాలను పేపర్ రహితంగా మార్చడం కాకుండా, ప్రజలకు వేగంగా, ఇబ్బందులు లేని పాలన అందించడమే ఈ డిజిటల్ ప్రయాణానికి అసలైన పరీక్ష కానుంది.

పట్టణాలపై పెరుగుతోన్న నీటి భారం

అమరావతి : సంస్కరణల ప్రభావంతో పట్టణ ప్రాంతాల్లో నీటి ఛార్జీల భారం క్రమంగా పెరుగుతోంది. వాటర్ రెగ్యులేటరీ కమిషన్ ఏర్పాటు చేస్తే ఈ భారం మోయలేని విధంగా మారే ప్రమాదం ఉంది. ఇప్పటికే వాణిజ్య, గ్రూపు హౌసింగ్ కుళాయిలకు మీటర్లు పెడుతున్న ప్రభుత్వం నెమ్మదిగా అన్ని ఇళ్లకూ పెట్టనుంది. అమృత్ పథకం సంస్కరణలతోపాటు, అంతకుముందు అమలు చేసిన జెఎన్ఎన్‌యుఆర్ఎం పథకం సంస్కరణలు కూడా ప్రజలపై భారం వేస్తున్నాయి. వాస్తవంగా యుపిఎ ప్రభుత్వ హయాంలో ఉన్న ఎన్‌యుఆర్ఎం పథకాన్నే అనంతరం అమృత్‌గా మార్చారు. పట్టణ స్థానిక సంస్థలు బలోపేతం కావాలంటూ అర్బన్ ఛాలెంజ్ ఫండ్ పథకాన్ని తీసుకొచ్చి కచ్చితంగా అప్పు చేయాల్సిందేననే నిబంధన పెట్టారు. ఈ రూపాల్లో తీసుకునే అప్పును తీర్చాలంటే 100 శాతం కాస్ట్ రికవరీ కింద ఖర్చు మొత్తాన్ని ప్రజల నుండే వసూలు చేయనున్నారు. ప్రస్తుతం వసూలు చేస్తున్న నీటి ఛార్జీలు సరిపోవడం లేదని, వీటిని ఇంకా పెంచాల్సి ఉంటుందని ప్రభుత్వం అంచనా వేసినట్లు తెలిసింది. రాష్ట్రంలో నీటి ఛార్జీల డిమాండు పాత బకాయిలతో కలిపితే సుమారు రూ.800 కోట్ల వరకూ ఉంది. ఆస్తిపన్నుతో పోలిస్తే నవంబరు నెల వరకూ రూ.510.23 కోట్లు వసూలు చేయాల్సి ఉంది. దీనిలో రూ.122.83 కోట్లు వసూలు చేశారు. గతేడాది ఇదే సమయానికి రూ.126.39 కోట్లు వసూలైంది. వాస్తవంగా ఇది చాలదని, మరింత పెంచాల్సి ఉంటుందని ప్రతిపాదించినట్లు తెలిసింది. దీనిపై అధికారులు తర్జన భర్జన పడుతున్నారు. ఇప్పటికే ప్రయోగాత్మకంగా కొన్ని నగరాల్లో అన్ని కనెక్షన్లకు నీటి మీటర్లు ఏర్పాటు చేస్తున్నారు. మరోవైపు నీటి ఛార్జీలే కాకుండా కనెక్షన్ ఛార్జీలు కూడా పెద్దయెత్తున వసూలు చేస్తున్నారు. నివాస ప్రాంతాలకు కనీసం రూ.8 వేల నుంచి రూ.30 వేల వరకూ వసూలు చేస్తుండగా, పరిశ్రమలకు వాటర్ కనెక్షన్ ఇచ్చేందుకు రూ.54 వేల వరకూ వసూలు చేస్తున్నారు. నీటి అవసరాలు పైపులైను సామర్థ్యం ఆధారంగా ఈ ఛార్జీలు ఉండనున్నాయి. అయితే రెగ్యులేటరీ కమిషన్ ఏర్పాటైతే కచ్చితంగా ప్రతి కనెక్షన్‌కూ నీటి మీటరు బిగించాల్సి ఉంటుందని మున్సిపల్ అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం విజయవాడ వంటి నగరాల్లో ఇప్పటికే మీటర్లు ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే.

కుల్గాంలో ఎన్‌కౌంటర్

జమ్మూకశ్మీర్: జమ్మూకశ్మీర్‌లోని కుల్గాం జిల్లాలో మరోసారి కాల్పుల మోత మోగింది. ఉగ్రవాదులకు, భద్రతా బలగాలకు మధ్య బుధవారం ఉదయం ఎన్‌కౌంటర్ ప్రారంభమైంది. జమ్మూకశ్మీర్ పోలీసులు, భద్రతా బలగాల సంయుక్త బృందం ఆపరేషన్ నిర్వహిస్తుండగా ఈ ఘటన చోటుచేసుకుంది. ఈ విషయాన్ని కశ్మీర్ జోన్ పోలీసులు 'ఎక్స్' వేదికగా ధ్రువీకరించారు. సోమవారం జరిగిన ఎన్‌కౌంటర్ నుంచి తప్పించుకున్న లష్కరే తోయిబా కమాండర్ లతీఫ్ భట్ కోసం భద్రతా బలగాలు ముమ్మరంగా గాలిస్తుండగా ఈ తాజా ఘటన జరిగింది. సోమవారం నాటి ఆపరేషన్‌లో లతీఫ్ సహచరుడైన ఉమర్ నిసార్ దార్ హతమయ్యాడు. నవంబర్ 11న కుల్గాంలోని అఖ్రాన్‌లో సీఆర్‌పీఎఫ్ బలగాలపై జరిగిన దాడిలో లతీఫ్, ఉమర్ ప్రమేయం ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. ఈ దాడిలో ముగ్గురు జవాన్లు గాయపడ్డారు. దాడికి ముందు రోజు, నవంబర్ 10న వీరిద్దరూ పలు ప్రాంతాల్లో రెక్కీ నిర్వహిస్తున్న దృశ్యాలు సీసీటీవీ ఫుటేజీలో నిక్షిప్తమయ్యాయి. బేకరీలో పనిచేసే ఉమర్, గత ఐదారు నెలలుగా లతీఫ్ భట్‌కు ఆశ్రయం కల్పిస్తున్నట్లు దర్యాప్తులో తేలింది. దాడి అనంతరం ఉమర్, లష్కరే అనుబంధ సంస్థ అయిన 'ది రెసిస్టెన్స్ ఫ్రంట్' (టీఆర్ఎఫ్)లో చేరినట్లు అధికారులు వెల్లడించారు. సోమవారం ఉమర్ మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్న భద్రతా బలగాలు, మోస్ట్ వాంటెడ్ ఉగ్రవాది అయిన లతీఫ్ కోసం గాలింపును తీవ్రతరం చేశాయి. ఈ క్రమంలోనే బుధవారం ఉదయం ఉగ్రవాదులు తారసపడటంతో ఎదురుకాల్పులు ప్రారంభమయ్యాయి. డీజీపీ, ఐజీపీ వంటి ఉన్నతాధికారులు ఈ ఆపరేషన్‌ను నిశితంగా పర్యవేక్షిస్తున్నారు.

కూటమిలో లుకలుకలు..తమ్ముళ్లకు లోకేష్ మద్దతు



విజయవాడ,గన్నవరం జడ్పీటీసీ ఉప ఎన్నికల్లో కూటమి అభ్యర్థి ఓటమి టీడీపీలో అంతర్గత విభేదాలకు కారణమైంది. బీజేపీ అభ్యర్థి చిగురుపాటి కుమారస్వామి 63 ఓట్ల తేడాతో ఓడిపోవడంతో ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావుపై సొంత పార్టీ నేతలే ఆరోపణలు చేస్తున్నారు. ఈ పరిణామాలపై మంత్రి నారా లోకేష్ ఆరా తీసినట్లు సమాచారం. గెలుపోటములు సహజమని, ఎమ్మెల్యేపై నిందలు వేయకుండా సమన్వయంతో పనిచేయాలని పార్టీ నేతలకు సూచించినట్లు తెలుస్తోంది. గన్నవరం నియోజకవర్గ ఎమ్మెల్యే, టీడీపీ నాయకుడు యార్లగడ్డ వెంకట్రావుపై తీవ్రస్థాయిలో దుమారం రేగింది. ప్రత్యర్థి పక్షం వైసీపీ సహా సొంత పార్టీ నాయకులు కూడా ఆయనపై విమర్శలు గుప్పిస్తూ.. సోషల్ మీడియాలో పోస్టులు చేస్తున్నారు. స్థానిక జడ్పీటీసీ ఎన్నికల ఫలితాల అనంతరం ఈ విమర్శలు వెల్లువెత్తడం గమనార్హం. కూటమి అభ్యర్థి ఓటమికి ఆయనే కారణమంటూ సొంత పార్టీలోని ఒక వర్గం, అలాగే ఇతర నేతలు విమర్శలు చేయడంతో నియోజకవర్గ రాజకీయాలు వేడెక్కాయి. ! జడ్పీటీసీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థి , బీజేపీనేత ఓటమి పాలయ్యారు. గన్నవరం జడ్పీటీసీ ఉప ఎన్నికలో కూటమి తరపున పోటీ చేసిన బీజేపీ అభ్యర్థి చిగురుపాటి కుమారస్వామిపై వైఎస్సార్‌సీపీ అభ్యర్థి 63 ఓట్ల స్వల్ప మెజారిటీతో విజయం సాధించారు. మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ అనుచరులకు యార్లగడ్డ వెంకట్రావు అండగా ఉండటం వల్లే వైసీపీ అభ్యర్థి గెలిచారని కొందరు స్థానిక టీడీపీ నేతలు ఆరోపించారు. ఎమ్మెల్యే నాయకత్వంపై కొంతకాలంగా ఒక వర్గం అసంతృప్తిగా ఉన్నట్లు వార్తలు కూడావస్తున్నాయి.ఎమ్మెల్యే యార్లగడ్డ ఈ వ్యవహారంపై తీవ్ర భావోద్వేగంతో స్పందించారు. తనపై వస్తున్న ఆరోపణలు, సోషల్ మీడియా ట్రోలింగ్‌పై తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. దశాబ్ద కాలంగా నియోజకవర్గంలో తాను చేసిన కృషి కార్యకర్తలకు తెలుసని, బీజేపీ అభ్యర్థి 63 ఓట్లతో ఓడిపోతే తనపై నిందలు వేయడం సరికాదని ఆయన స్పష్టం చేశారు. ఈ పరిణామాల మధ్య మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ చేసిన వ్యాఖ్యలపై యార్లగడ్డ తీవ్రంగా స్పందిస్తూ సవాలు విసిరారు. మరోవైపు, యార్లగడ్డ వ్యాఖ్యలకు కౌంటర్‌గా వైసీపీ జడ్పీటీసీ అనగాని రవి విమర్శలు గుప్పించారు... ఈ పరిణామాలపై మంత్రి నారా లోకేష్ ఆరా తీశారని స్థానిక నాయకులు తెలిపారు. గెలుపు - ఓటములు సహజమని .. ఎమ్మెల్యేపై నిందలు వేయడం మానుకోవాలని సొంత పార్టీ నాయకులకు లోకేష్ చెప్పినట్లు తెలిసింది. అంతే కాదు.. అందరూ కలివిడిగా ఉంటూ.. వైసీపీని ఎదుర్కొనే విషయంపై ముందుకు సాగాలని ఆయన సూచించారు. బలమైన గన్నవరం నియోజకవర్గంలో టీడీపీ గ్రాఫ్‌కు ఎలాంటి విఘాతం రాకుండా చూసుకోవాలని సూచించారు. ముఖ్యంగా ఎమ్మెల్యే వర్గం.. పార్టీ వర్గంఅంటూ రెండు ఉండడానికి వీల్లేదని.. మంత్రి, ఎమ్మెల్యే, నియోజకవర్గం నేతలు సమన్వయంతో ముందుకు సాగాలని లోకేష్ తేల్చి చెప్పారని నాయకులు చెబుతున్నారు.

అనంతలో సేమ్ సీన్

కూటమి అభ్యర్థులను గెలిపించాలి. కూటమి పార్టీల మధ్య కలివిడి ఉండాలి. ఎంపిక చేసిన అభ్యర్థులను గెలిపిం చే బాధ్యత నాయకులదే. ఎవరైనా కాదు.. కూడదని రెబెల్స్‌గా బరిలోకి దిగితే.. వారిపై వేటు వేస్తాం. ఎట్టి పరిస్థితి లోనూ పార్టీలో చేర్చుకునేది కూడా లేదు." ఈ నెలలో జరిగిన ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల సమయంలో సీఎం చంద్రబాబు పార్టీ శ్రేణులకు చేసిన దిశానిర్దేశం ఇది!. అయితే..చంద్రబాబు ఈ మాట చెప్పేసరికే.. చాలా మంది నాయకులు రెబెల్స్‌గా బరిలో నిలిచారు. ఓడినవారు ఓడారు. గెలిచిన వారు గెలిచారు దాదాపు 32 మందినాయకులపై పార్టీ కూడా సస్పెన్షన్ వేటు వేసింది. కట్ చేస్తే.. ఇప్పుడు టీడీపీకి ప్రాణ సంకటమైన పరిణామం తెరమీదకు వచ్చింది. జడ్పీటీసీ ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థులుగా గెలిచిన ఇద్దరు నాయకుల వ్యవహారం అనంతపురం జిల్లాలో చర్చ తెరమీదికి వచ్చింది. అది కూడా అమిలినేని సురేంద్రబాబు ప్రాతినిధ్యం వహిస్తున్న కళ్యాణదుర్గం నియోజకవర్గంలో జరగడం గమనార్హం. ఈయనకు చంద్రబాబు వద్ద మంచి పేరున్న విషయం తెలిసిందే. దీంతో ఇప్పుడు చంద్రబాబు ఏం చేస్తారన్నది ఆసక్తిగా మారింది. కల్యాణ దుర్గం నియోజకవర్గం పరిధిలోని కంబదూరు నుంచి వేముల శారద ఇండిపెండెంటుగా విజయం దక్కించుకున్నారు. వాస్తవానికి ఈమె టీడీపీ టికెట్ ఆశించారు. కానీ, ఇవ్వలేదు. దీంతో స్వతంత్రంగా నామినేషన్ వేశారు. ఫలితాల్లో 7,336 ఓట్ల మెజారిటీతో విజయం దక్కించుకున్నారు. ఈమెకు టీడీపీ తరపున భారీ మద్దతు లభించింది. దీంతో విజయం వరించిందన్న టాక్ ఉంది. వాస్తవానికి ఈ టికెట్‌ను జనసేనకు కేటాయించారు. ఆ జనసేనను ఓడించే శారద విజయం దక్కించుకున్నారు. ఇప్పుడు ఆమె ఇండిపెండెంట్.. ఈ నెల 23న ప్రమాణ స్వీకారం చేయాల్సిఉంది. ఈ నేపథ్యంలోనే ఆమె తిరిగి టీడీపీలో చేర్చుకునేందుకు తెరచాటు మంతనాలు ప్రారంభమయ్యాయి.

తమిళనాడు,కర్ణాటక మధ్య కావేరి వార్...

చెన్నై,కర్ణాటకలోని కావేరీ నదిపై మేకదాటు దగ్గర భారీ జలాశయం నిర్మించాలని అక్కడి ప్రభుత్వం ప్రతిపాదించింది. బెంగళూరుతో పాటు పరిసర ప్రాంతాల తాగునీటి అవసరాలు తీర్చడం ఈ ప్రాజెక్టు ప్రధాన లక్ష్యం. నీటిని నిల్వ చేయడంతో పాటు విద్యుత్ ఉత్పత్తి చేయాలని కర్ణాటక భావిస్తోంది. ఈ ప్రాజెక్టు ద్వారా సుమారు 67 టీఎంసీల నీటిని నిల్వ చేయాలని ప్రతిపాదించింది. తాగునీటి అవసరాలకు 4.75 టీఎంసీలు వినియోగించాలని ప్రణాళికలో పేర్కొంది. సుమారు 400 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి కూడా లక్ష్యంగా పెట్టుకుంది. అయితే తమిళనాడు ఈ ప్రతిపాదనను తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. జలాశయం నిర్మిస్తే తమకు వచ్చే కావేరీ నీటి ప్రవాహంపై ప్రభావం పడుతుందని ఆందోళన వ్యక్తం చేస్తోంది. ముఖ్యంగా డెల్టా ప్రాంత రైతుల సాగునీటి అవసరాలు దెబ్బతింటాయని వాదిస్తోంది. కర్ణాటకకు నీటి నిల్వ అవసరం. తమిళనాడుకు నీటి ప్రవాహంపై భరోసా కావాలి. ఈ రెండు వాదనల మధ్యే మేకదాటు వివాదం కొనసాగుతోంది.కావేరీ నదిపై ఎగువ ప్రాంతంలో కర్ణాటక జలాశయం నిర్మిస్తే నీటి నిల్వ, విడుదలపై ఆ రాష్ట్రానికి మరింత నియంత్రణ లభిస్తుందని తమిళనాడు భావిస్తోంది. దీనివల్ల తమకు కేటాయించిన నీటి వాటా అందడంలో ఇబ్బందులు తలెత్తవచ్చని వాదిస్తోంది. కావేరీ డెల్టాలో వరి సాగు ఎక్కువగా జరుగుతుంది. ఈ ప్రాంత రైతులు నదీ జలాలపైనే ఆధారపడుతున్నారు. నీటి విడుదలలో ఆలస్యం జరిగినా పంటలపై ప్రభావం పడుతుంది. అందుకే మేకదాటు నిర్మాణానికి అనుమతులు ఇవ్వొద్దని తమిళనాడు పట్టుబడుతోంది.మరోవైపు కర్ణాటక తన ప్రతిపాదనను సమర్థిస్తోంది. బెంగళూరు నగరం వేగంగా విస్తరిస్తుండటంతో తాగునీటి అవసరాలు పెరుగుతున్నాయని చెబుతోంది. భవిష్యత్తులో నీటి కొరత రాకుండా జలాశయం ఉపయోగపడుతుందని వివరిస్తోంది. వర్షాకాలంలో వచ్చే నీటిని నిల్వ చేసుకోవచ్చని అంటోంది. తమిళనాడుకు కేటాయించిన 177.25 టీఎంసీల నీటిని విడుదల చేసే బాధ్యతను తాము పాటిస్తామని చెబుతోంది. జలాశయం వల్ల తమిళనాడుకు కూడా ప్రయోజనం ఉంటుందని కర్ణాటక వాదిస్తోంది. అయితే ఈ వాదనలను తమిళనాడు అంగీకరించడం లేదు. నీటి వాటా కేటాయింపులు ఉన్నప్పటికీ.. అదనపు జలాశయం వల్ల భవిష్యత్తులో తమకు ఇబ్బందులు రావచ్చని ఆందోళన చెందుతోంది.మేకదాటు విషయంలో తమిళనాడు అభ్యంతరాలు కొనసాగుతున్న సమయంలో విజయ్ కర్ణాటక సీఎంతో ఒకే వేదికపై కనిపించడం వివాదానికి కారణమైంది. సోనియా గాంధీ పుస్తకావిష్కరణ కార్యక్రమంలో ఇద్దరూ కలుసుకున్నారు. ఈ భేటీలో కావేరీ జలాల అంశాన్ని విజయ్ ప్రస్తావించారా లేదా అన్నది కూడా చర్చకు వచ్చింది. రాష్ట్ర హక్కుల కోసం పోరాడాల్సిన సమయంలో రాజకీయ మర్యాదలకే ప్రాధాన్యం ఇచ్చారని ప్రతిపక్షాలు విమర్శించాయి.విజయ్ ఢిల్లీ పర్యటనపై బీజేపీ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. తమిళనాడు ప్రయోజనాలను కాపాడాల్సిన ముఖ్యమంత్రి, ముందుగా మేకదాటు ప్రాజెక్టుపై తన వ్యతిరేకతను స్పష్టంగా తెలియజేయాల్సిందని బీజేపీ నేతలు అంటున్నారు. కర్ణాటక సీఎం ప్రాజెక్టు నిర్మాణంపై పట్టుదలగా ఉన్న సమయంలో విజయ్ ఆయనతో స్నేహపూర్వకంగా కనిపించడం తప్పు సంకేతాలు ఇస్తోందని విమర్శిస్తున్నారు. రాష్ట్ర హక్కుల విషయంలో రాజకీయ రాజీలు ఉండకూడదని బీజేపీ వాదిస్తోంది. ఈ ఘటనను విజయ్ ప్రభుత్వంపై ఒత్తిడి పెంచేందుకు ఉపయోగించుకుంటోంది.బీజేపీతో పాటు తమిళనాడులోని ప్రధాన ప్రతిపక్షాలు కూడా విజయ్‌పై విమర్శలు పెంచాయి. డీఎంకే నేతలు విజయ్ మేకదాటు సమస్యను సీరియస్‌గా తీసుకోవడం లేదని ఆరోపించారు. ఈ అంశంపై రాష్ట్రంలోని అన్ని పార్టీలతో సమావేశం నిర్వహించి ఉమ్మడి వైఖరిని ప్రకటించాలని మాజీ సీఎం స్టాలిన్ డిమాండ్ చేశారు. మేకదాటు విషయంలో రాజకీయాలకు అతీతంగా తమిళనాడు ఒక్కటిగా నిలవాలని పిలుపునిచ్చారు. అన్నాడీఎంకే కూడా విజయ్ తీరును తప్పుబట్టింది. కాంగ్రెస్ మద్దతుపై ఆధారపడటం వల్లే కర్ణాటక విషయంలో గట్టిగా మాట్లాడలేకపోతున్నారని విమర్శించింది. రాష్ట్ర హక్కుల కంటే ముఖ్యమంత్రి పదవికే ప్రాధాన్యం ఇస్తున్నారని ఆరోపించిందిమరోవైపు విజయ్ కూడా ఈ వివాదంపై స్పందించారు. కావేరీ సమస్యను చర్చల ద్వారా పరిష్కరించుకోవాలన్న ఉద్దేశంతో కర్ణాటకకు వెళ్లాలని భావించినట్లు తెలిపారు. తమిళనాడు ప్రజల ప్రయోజనాల కోసం అవమానాలు ఎదురైనా భరించేందుకు సిద్ధమని పేర్కొన్నారు. కావేరీ విషయంలో రాజీ పడే

ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. మేకదాటు ప్రాజెక్టుకు వ్యతిరేకంగా తమ పోరాటం కొనసాగుతుందని వెల్లడించారు. పొరుగు రాష్ట్రంతో చర్చలు జరపడం తప్పు కాదని, నమన్యకు పరిష్కారం కనుగొనడమే ముఖ్యమని ఆయన అభిప్రాయపడ్డారు. దీంతో ఈ వివాదం కేవలం వేదిక పంచుకున్న అంశం నుంచి, విజయ్ రాజకీయ వైఖరి చుట్టూ తిరిగే చర్చగా మారింది.విజయ్ తీరును కాంగ్రెస్ నేతలు సమర్థించారు. సోనియా గాంధీ, రాహుల్ గాంధీ ఆహ్వానం మేరకే ఆయన పుస్తకావిష్కరణ కార్యక్రమానికి హాజరయ్యారని కాంగ్రెస్ ఎంపీ మాణిక్కం ఠాగూర్ తెలిపారు. ఒక కార్యక్రమంలో ఇద్దరు ముఖ్యమంత్రులు కలుసుకోవడాన్ని నీటి వివాదంతో ముడిపెట్టడం సరికాదని అన్నారు. బీజేపీ, డీఎంకే రాజకీయ ప్రయోజనాల కోసం ఈ అంశాన్ని పెద్దది చేస్తున్నాయని విమర్శించారు. అయితే కాంగ్రెస్ సమర్థనతో వివాదం సద్దుమణగలేదు. తమిళనాడు హక్కుల విషయంలో విజయ్ మరింత స్పష్టంగా వ్యవహరించాలన్న డిమాండ్ కొనసాగుతోంది.మేకదాటు వివాదం రాజకీయాలకే పరిమితం కాలేదు. న్యాయపరంగానూ కొనసాగుతోంది. 2018లో కావేరీ జలాల పంపిణీపై సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చింది. తమిళనాడుకు ఏటా 177.25 టీఎంసీల నీరు కేటాయించింది. 2025 నవంబర్‌లో మేకదాటు ప్రాజెక్టుకు సంబంధించిన డీపీఆర్ తయారీ అనుమతిపై తమిళనాడు వేసిన పిటిషన్లను సుప్రీంకోర్టు తిరస్కరించింది. అయితే దీనివల్ల ప్రాజెక్టు నిర్మాణానికి అన్ని అనుమతులు వచ్చిందని కాదు. 2026 జూన్‌లో కేంద్ర జల సంఘం కర్ణాటక సమర్పించిన డీపీఆర్‌ను తిరిగి పంపింది. కావేరీ జలాల కేటాయింపులకు అనుగుణంగా మార్పులు చేయాలని సూచించింది. అంటే ప్రాజెక్టు నిర్మాణానికి ఇంకా అనేక అనుమతుల ప్రక్రియలు మిగిలే ఉన్నాయి.ఈ వివాదంలో అసలైన ఆందోళన రైతులదే. కావేరీ నీరు సకాలంలో అందకపోతే పంటలు దెబ్బతింటాయి. సాగు ఖర్చులు పెరుగుతాయి. రైతుల ఆదాయంపై ప్రభావం పడుతుంది. తమిళనాడులోని కావేరీ డెల్టా ప్రాంతం వ్యవసాయానికి ఎంతో కీలకం. కర్ణాటకలోనూ తాగునీటి అవసరాలు పెరుగుతున్నాయి. రెండు రాష్ట్రాల అవసరాలు నిజమైనవే అయినప్పటికీ.. నీటి పంపిణీలో ఎవరికీ అన్యాయం జరగకూడదు. నీటి చుక్క రైతుకు జీవం. రాజకీయ నాయకుడికి అది కేవలం ఎన్నికల అంశం కాకూడదు.సినీ రంగం నుంచి రాజకీయాల్లోకి వచ్చిన విజయ్‌కు ఇది కీలకమైన పరీక్షగా మారింది. ప్రజాదరణ సంపాదించడం ఒక ఎత్తు. రాష్ట్ర సమస్యలను పరిష్కరించడం మరో ఎత్తు. ఒకవైపు కాంగ్రెస్ నేతలతో రాజకీయ సంబంధాలు కొనసాగించాలి. మరోవైపు కర్ణాటకతో నీటి వివాదంలో తమిళనాడు ప్రయోజనాలను కాపాడాలి. ఈ రెండింటి మధ్య సమతూకం పాటించడం విజయ్‌కు సవాలుగా మారింది. ముఖ్యంగా మేకదాటు విషయంలో ఆయన తీసుకునే నిర్ణయాలు భవిష్యత్తులో రాజకీయంగా ప్రభావం చూపనున్నాయి.మేకదాటు వివాదం ఇప్పుడు నీటి సమస్యను దాటి రాజకీయ పోరాటంగా మారింది. కర్ణాటక తన ప్రాజెక్టు కోసం పట్టుబడుతోంది. తమిళనాడు తన నీటి హక్కుల కోసం పోరాడుతోంది. మధ్యలో విజయ్ రాజకీయ వైఖరి చర్చనీయాంశంగా మారింది. బీజేపీ విమర్శలు. డీఎంకే, అన్నాడీఎంకే ఆరోపణలు. కాంగ్రెస్ సమర్థనతో వ్యవహారం మరింత వేడెక్కింది. రాజకీయ బంధాలు మారుతుంటాయి. కానీ రాష్ట్ర ప్రయోజనాలు శాశ్వతం. మేకదాటు విషయంలో విజయ్ మాటలకు, చేతలకు మధ్య స్పష్టత కనిపించాల్సి ఉంది. తమిళనాడు నీటి హక్కుల కోసం ఆయన ఎంత బలంగా నిలబడతారన్నదే ఈ రాజకీయ వివాదంలో కీలకంగా మారనుంది.

సామాన్య కార్యకర్తకు లోకేశ్ పట్టం

అమరావతి,రాజకీయాల్లో పదవులు రావాలంటే పలుకుబడి ఉండాలి.. ఆర్థిక బలం ఉండాలి.. నాయకుల చుట్టూ తిరిగే పరిచయాలు ఉండాలి. ఇదే ఇప్పటివరకు చాలామంది నమ్ముతున్న రాజకీయ సూత్రం. కానీ మంగళగిరి-తాడేపల్లి నగరపాలక సంస్థ మేయర్ అభ్యర్థి ఎంపిక విషయంలో టీడీపీ తీసుకున్న నిర్ణయం ఈ సంప్రదాయ రాజకీయ లెక్కలకు భిన్నమైన సంకేతాలిస్తోంది. సామాన్య కార్యకర్త పేరం ఏడుకొండలుకు మేయర్ అభ్యర్థిగా అవకాశం కల్పిస్తూ మంత్రి నారా లోకేశ్ తీసుకున్న నిర్ణయం ఇప్పుడు రాజకీయ వర్గాల్లో చర్చకు దారితీస్తోందిమంగళగిరి-తాడేపల్లి కార్పొరేషన్ మేయర్ పదవి ఎస్టీ సామాజిక వర్గానికి రిజర్వ్ కావడంతో ఈ పదవిపై పలువురు ఆశలు పెట్టుకున్నారు. ఆర్థికంగా బలమైన కుటుంబాలకు చెందినవారు, రాజకీయంగా పలుకుబడి ఉన్న నేతలు ఈ అవకాశం కోసం ప్రయత్నించినట్లు స్థానికంగా ప్రచారం జరిగింది. అయితే, ఈ అంచనాలకు భిన్నంగా గండాలయపేటకు చెందిన పేరం ఏడుకొండలును టీడీపీ అభ్యర్థిగా ప్రకటించడం ఆసక్తికరంగా మారింది.నిరుపేద కుటుంబం నుంచి వచ్చిన ఏడుకొండలు పార్టీ ఆవిర్భావం నుంచి కార్యకర్తగా కొనసాగుతూ, కష్టకాలంలోనూ పార్టీ జెండాను మోశారు. పదవులు లేకపోయినా పార్టీ కోసం పనిచేసిన ఆయనకు ఇప్పుడు కీలక బాధ్యత అప్పగించాలనే నిర్ణయం తీసుకున్నట్లు టీడీపీ వర్గాలు చెబుతున్నాయి.ఇక్కడే లోకేశ్ నిర్ణయంలోని రాజకీయ కోణం కనిపిస్తోంది. ఎన్నికల సమయంలో మాత్రమే కార్యకర్తలు గుర్తుకు వచ్చే పరిస్థితి కాకుండా, పార్టీ కోసం నిరంతరం పనిచేసేవారికి అధికారంలోనూ ప్రాధాన్యం ఉంటుందనే సందేశాన్ని పంపే ప్రయత్నంగా ఈ ఎంపికను చూడవచ్చు.ఈ మేయర్ అభ్యర్థి ఎంపికకు మరో ప్రత్యేకత కూడా ఉంది. వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి నివాసం ఉండే తాడేపల్లి ప్రాంతం కూడా ఈ కార్పొరేషన్ పరిధిలోనే ఉంది. దీంతో మంగళగిరి-తాడేపల్లి రాజకీయంగా టీడీపీ, వైసీపీలకు అత్యంత కీలకమైన ప్రాంతం.అలాంటి చోట సామాన్య కార్యకర్తను మేయర్ అభ్యర్థిగా ప్రకటించడం ద్వారా టీడీపీ ఒక రాజకీయ ప్రయో

రికార్డులు బద్దలు కొడతాం.. యోగి సంచలన స్టేట్మెంట్



లక్నో: ఉత్తరప్రదేశ్‌లో మరోసారి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తామని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ధీమా వ్యక్తం చేశారు. 2027లో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ వరుసగా మూడోసారి విజయం సాధిస్తుందని విశ్వాసం ప్రకటించారు. ఈసారి గెలుపు కేవలం హ్యాట్రిక్‌కే పరిమితం కాదని, సరికొత్త రికార్డును నెలకొల్పుతామని పేర్కొన్నారు.

లక్నోలో నిర్వహించిన రైజింగ్ భారత్ సమ్మిట్‌లో నెట్‌వర్క్18 గ్రూప్ ఎడిటర్-ఇన్-చీఫ్ రాహుల్ జోషితో జరిగిన ముఖాముఖిలో యోగి ఈ వ్యాఖ్యలు చేశారు. గతంలో సమాజ్‌వాదీ పార్టీ, కాంగ్రెస్ పాలనలో రాష్ట్రం ఎదుర్కొన్న పరిస్థితులను ప్రజలకు వివరిస్తూ ఎన్నికల ప్రచారంలో ముందుకు వెళ్తామని తెలిపారు.రాష్ట్రంలో శాంతిభద్రతలకు ప్రాధాన్యత ఇచ్చామని, ప్రతి ఒక్కరికీ భద్రత కల్పించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. పెట్టుబడులకు అనుకూలమైన వాతావరణాన్ని కల్పించడంతో పాటు అభివృద్ధి కార్యక్రమాలను కొనసాగిస్తున్నామని వివరించారు. బీజేపీ కార్యకర్తలు కూడా ఎన్నికల లక్ష్యంతో క్షేత్రస్థాయిలో పనిచేస్తున్నారని పేర్కొన్నారు.గత ప్రభుత్వాల పాలనతో ప్రస్తుత పరిస్థితులను ప్రజలు పోల్చి చూస్తున్నారని యోగి అన్నారు. తమ పాలనలో అన్ని వర్గాలకు ప్రయోజనం చేకూర్చే ప్రయత్నం చేశామని తెలిపారు. 2027 ఎన్నికల్లో బీజేపీ, దాని మిత్రపక్షాలు కలిసి మరోసారి ప్రజల మద్దతు పొందుతాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

షీ టీమ్స్ పేరుతో నకిలీ పోలీసు నోటీసు

హైదరాబాద్: ప్రేమ సంబంధం బ్రేక్ ఆప్ కావడంతో యువకుడిని భయపెట్టేందుకు షీ టీమ్స్ పేరుతో నకిలీ పోలీసు నోటీసు సృష్టించి వాట్సాప్‌లో పంపిన యువతి, ఆమె స్నేహితుడిపై సైఫాబాద్ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల వివరాల ప్రకారం.. కూకట్‌పల్లి హెచ్‌బీ కాలనీ, బాలాజీనగర్‌కు చెందిన తిరునేశ్వర్ వీరంకి (24)కు హరి అనే వ్యక్తి వాట్సాప్ ద్వారా షీ టీమ్స్ కార్యాలయానికి విచారణకు హాజరు కావాలంటూ నోటీసు పంపాడు. బాధితుడు నకిలీ నోటీసులతో షీ టీమ్స్ ముందు విచారణకు హాజరైయ్యారు. నోటీసులు నకిలీ అని తేలడంతో... షీ టీమ్స్ ఎసై వెంకటేష్ సైఫాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసుల విచారణలో మహీంద్రా యూనివర్సిటీ విద్యార్థిని కొల్లూరి హశ్విత తేజ (24) బాధితుడితో ఐదేళ్లుగా ప్రేమలో ఉందని, పెళ్లి చేసుకుంటానని హామీ ఇచ్చిన యువకుడు ఏడాదిగా దూరంగా ఉంటూ సోషల్ మీడియాలో బ్లాక్ చేశాడని తెలిసింది.

వంద శాతం లక్ష్యంతో జనసేన



ఒంగోలు,ఏపీలో రెండో విడత పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల రాజకీయం ఊపందుకుంది. నాలుగు కార్పొరేషన్లు, 19 మున్సిపాలిటీలు, నగర పంచాయతీల్లో ఎన్నికలకు సర్వం సిద్ధం అయింది. ఇప్పటికే పొలిటికల్ పార్టీలు క్యాండిడేట్స్‌ను అనౌన్స్ చేసి క్యాంపెయిన్‌లో జోరు పెంచుతున్నాయి. ఎస్పెషల్‌గా ఫస్ట్ ఫేజ్‌లో పురపోరలో వచ్చిన ఫలితాల్లో కూటమిలో జోరు ఎక్కువగా కనిపిస్తోంది. జనసేన పార్టీ ఇప్పుడు జరుగుతున్న మున్సిపల్ ఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంటుంది.ఇప్పటికే తొలి విడతలో మంచి ఫలితాలు సాధించిన ఆ పార్టీ..రెండో విడతలోనూ అదే జోరును కొనసాగించాలని భావిస్తోంది. ఇందులో భాగంగా మేయర్, మున్సిపల్ చైర్మన్ పదవులకు అభ్యర్థులను ఖరారు చేశారు ఆ పార్టీ అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్. స్థానిక రాజకీయ పరిస్థితులు, పార్టీ బలాబలాలను పరిగణనలోకి తీసుకొని క్యాండిడేట్స్‌ను సెలెక్ట్ చేసిన పవన్..కూటమిలో టీడీపీ, బీజేపీ కోఆర్డినేషన్‌పై పార్టీ నేతలకు డైరెక్షన్స్ ఇచ్చారట.ఏపీలో కూటమిలో రెండో బలమైన మిత్రపక్షంగా ఉన్న జనసేనకు పొత్తులో భాగంగా నాలుగు మేయర్ పదవులతో పాటు 21 మున్సిపల్, నగర పంచాయతీ చైర్మన్ పదవులు దక్కాయి. అయితే కొన్ని అనివార్య కారణాలు, న్యాయపరమైన ఇబ్బందులతో కొన్ని కార్పొరేషన్లు, మున్సిపాలిటీలకు ఎన్నికలు జరగలేదు. అందులో జనసేనకు కేటాయించిన నాలిగింటిలో రెండు కార్పొరేషన్లతో 3 మున్సిపాలిటీలు ఉన్నాయి. శ్రీకాకుళం మేయర్ అభ్యర్థిగా డాక్టర్ దానేటి రాధారాణి, కాకినాడ మేయర్ అభ్యర్థిగా ఆకుల భవాని పేర్లు ఖరారు చేశారు. అలాగే రాజాం మున్సిపల్ చైర్‌పర్సన్ అభ్యర్థిగా బనిశెట్టి సౌజన్య లత, భీమవరం మున్సిపల్ చైర్‌పర్సన్ అభ్యర్థిగా డాక్టర్ చుండూరి మల్లేశ్వరి, తాడేపల్లిగూడెం చైర్మన్ అభ్యర్థిగా పాలూరు వెంకటేశ్వరరావు పేర్లను ఎంపిక చేశారు పవన్.మ్యాప్‌లు చూడండిమొదటి దశలో జనసేన పోటీ చేసిన 15 మున్సిపాలిటీలు, 3 నగర పంచాయతీల చైర్మన్ స్థానాలన్నింటిలో ఘన విజయం సాధించింది. పిఠాపురం, గొల్లప్రోలు, తుని, నిడదవోలు, నరసాపురం, పెడన, తిరువూరు, చిలకలూరిపేట, సాలూరు, అమలాపురం, సామర్లకోట మున్సిపాలిటీల్లో జెండా ఎగరవేసింది ఆ పార్టీ. విజయవాడ, ఏలూరు మేయర్ పీఠాలను కూడా స్వాధీనం చేసుకుంది. దీంతో రెండో విడతలో కూడా సెంట్ పర్సెంట్ విజయాలను దక్కించుకోవాలని జనసేన వ్యూహ రచన చేస్తోంది.తొలి విడత ఎన్నికల్లో జనసేనకు అనుకూలమైన ఫలితాలు రావడం పార్టీ నాయకత్వంలో ఉత్సాహాన్ని పెంచింది. ఆ దశలో పోటీ చేసిన 15 మున్సిపాలిటీలు, మూడు నగర పంచాయతీల చైర్మన్ స్థానాలను పార్టీ గెలుచుకుని ఫుల్ జోష్‌లో ఉంది. పట్టణ ప్రాంతాల్లో తమ పార్టీకి ప్రజాదరణ పెరుగుతోందని జనసేన నాయకులు అంచనా వేస్తున్నారట. అయితే రెండో విడతలో పరిస్థితులు ఎలా ఉంటాయన్నది ఆసక్తికరంగా మారింది. స్థానికంగా అభ్యర్థుల ఎంపిక, కూటమి పార్టీల మధ్య సమన్వయం, ఓటర్ల మద్దతు ఫలితాలను ప్రభావితం చేయనున్నాయి.కేవలం అభ్యర్థులను ప్రకటించడమే కాకుండా, క్షేత్రస్థాయిలో టీడీపీ, బీజేపీ శ్రేణులను సమన్వయం చేసుకోవడం, ప్రజలు ఆకట్టుకోవడం సవాల్‌గా చెబుతున్నారు. అయితే కాకినాడలో జనసేనకు అనుకూలంగానే ఉన్నా..20ఏళ్ల తర్వాత జరుగుతున్న సిక్కోలు కార్పొరేషన్‌లోనే ఎలాంటి సీన్ ఉండబోతుందనే చర్చ జరుగుతోంది. అక్కడ వైసీపీ టీడీపీ నుంచి మాజీ ఎమ్మెల్యే గుండలక్ష్మీని అభ్యర్థిగా పెడుతుంది. సేమ్‌టైమ్ మాజీమంత్రి ధర్మాన సిక్కోలు మేయర్ ఎన్నికలకు అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకొని పనిచేస్తున్నారు. శ్రీకాకుళంలో బలమైన అనుచర వర్గం, ఫాలోయింగ్ ఉన్న గుండలక్ష్మిని పార్టీలోకి చేర్చుకొని కూటమికి సవాల్ విసురుతోంది వైసీపీ.మరోవైపు మేయర్ పీఠం ఆశించి నిరాశపడ్డ తెలుగు తమ్ముళ్లు జనసేన అభ్యర్థి విజయానికి ఎంతవరకు సహకరిస్తారన్నది కూడా బిగ్ క్వశ్చన్‌గా మారిందట. అయితే జిల్లా మంత్రులు, జనసేన కోఆర్డినేటర్లు..సిక్కోలు కార్పొరేషన్‌పై జెండా ఎగరవేసేందుకు అన్ని

నిబంధనలు ఉల్లంఘించిన రియల్ ఎస్టేట్ సంస్థలపై టీజీ రెరా కొరడా



హైదరాబాద్:నిబంధనలను ఉల్లంఘిస్తూ కొనుగోలుదారులను మోసగిస్తున్న పలు రియల్ ఎస్టేట్ కంపెనీలపై తెలంగాణ రియల్ ఎస్టేట్ రెగ్యులేటరీ అథారిటీ (టీజీ రెరా) కఠిన చర్యలు చేపట్టింది. ముందస్తు రిజిస్ట్రేషన్ లేకుండా ప్రాజెక్టులను మార్కెటింగ్ చేయడం, ఇళ్ల నిర్మాణంలో తీవ్ర జాప్యం, చట్టబద్ధమైన అనుమతులు పొందకపోవడం, కొనుగోలుదారుల నుంచి వసూలు చేసిన మొత్తాలను తిరిగి చెల్లించకపోవడం వంటి ఉల్లంఘనలపై అథారిటీ కొరడా ఝళిపించింది. ఈ మేరకు నవంబర్ 17న వెలువరించిన ఉత్తర్వుల ద్వారా పలు సంస్థలపై భారీ జరిమానాలు విధించడంతో పాటు, బాధితులకు వడ్డీతో సహా నగదు తిరిగి చెల్లించాలని ఆదేశించింది. రంగారెడ్డి జిల్లా గండిపేట మండలం మంచిరేవులలో చేపట్టిన 'సనాలి ది ఎడ్జ్' ప్రాజెక్టుకు రెరా రిజిస్ట్రేషన్ లేకుండానే ప్రచారం, విక్రయాలు చేపట్టినందుకు గాను సనాలి ఐటీ పార్క్ సంస్థకు అథారిటీ రూ. 25 లక్షల భారీ జరిమానా విధించింది. మేనేజింగ్ పార్టనర్ నూర్ హక్ ప్రాతినిధ్యం వహిస్తున్న ఈ సంస్థ రెరా చట్టం సెక్షన్ 3(1)ని ఉల్లంఘించినట్లు తేల్చింది. జరిమానా మొత్తాన్ని 30 రోజుల్లోగా చెల్లించాలని, ప్రాజెక్టుకు రిజిస్ట్రేషన్ వచ్చేంతవరకు ప్రకటనలు, బుకింగ్‌లు, విక్రయాలు తక్షణమే నిలిపివేయాలని స్పష్టం చేసింది. అయితే, భూముల రిజిస్ట్రేషన్ రద్దు తమ పరిధిలోకి రాదని స్పష్టం చేస్తూ, పరిహారం కోసం బాధితులు సంబంధిత న్యాయస్థానాలను ఆశ్రయించవచ్చని తెలిపింది. సంగారెడ్డి జిల్లా వెలిమలలోని 'ఆరా' ప్రాజెక్టులో ఇద్దరు కొనుగోలుదారుల నుంచి పెద్దమొత్తంలో డబ్బులు వసూలు చేసి, నిర్మాణాన్ని గడువులోగా పూర్తి చేయని భువన్‌తేజ ఇన్‌ఫ్రాప్రాజెక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్‌కు టీజీ రెరా కీలక ఆదేశాలు జారీ చేసింది. 1,700 చదరపు అడుగుల ఫ్లాట్ కోసం చెల్లించిన రూ. 26 లక్షలను 10.85 శాతం వార్షిక వడ్డీతో కలిపి 45 రోజుల్లోగా తిరిగి చెల్లించాలని ఆదేశించింది. అలాగే సదరు డెవలపర్‌ను డిఫాల్టర్‌గా ప్రకటిస్తూ ప్రాజెక్ట్ కార్యకలాపాలను తక్షణమే నిలిపివేయాలని, భవిష్యత్ ప్రాజెక్టులలోనూ బుకింగ్‌లు చేపట్టరాదని స్పష్టం చేసింది. తెల్లాపూర్‌లోని 'త్రిపుర నిర్వాణ' ప్రాజెక్టులో అనుమతులు లేకుండానే రూ. 41.85 లక్షలు వసూలు చేసిన త్రిపుర కన్‌స్ట్రక్షన్స్ సంస్థకు కూడా రెరా షాక్ ఇచ్చింది. ఆ మొత్తాన్ని 10.85 శాతం వడ్డీతో వాపస్ ఇవ్వాలని నిర్దేశించింది. నవంబర్ 20, 2026 నాటికి రూ. 10 లక్షలు, మిగిలిన మొత్తాన్ని ఫిబ్రవరి 2027 నాటికి నాలుగు సమాన వాయిదాల్లో చెల్లించాలని, వడ్డీ బకాయిలను 60 రోజుల్లో తీర్చాలని ఆదేశించింది. శంకర్‌పల్లిలోని 'జాస్విత ఎస్టేట్స్'లో ప్లాట్ కోసం రూ. 47 లక్షలు తీసుకుని రిజిస్ట్రేషన్ చేయకుండా, ఇచ్చిన చెక్కులు బౌన్స్ అయిన కేసులో శాండ్‌స్టోన్ ఇన్‌ఫ్రా ప్రైవేట్ లిమిటెడ్ 10.85 శాతం వడ్డీతో పూర్తి నగదును 60 రోజుల్లో తిరిగి ఇవ్వాలని పేర్కొంది. హెచ్‌ఎండీఏ, రెరా అనుమతులు తీసుకోకుండా 'టెక్ హోమ్స్' పేరిట విల్లా కోసం అడ్వాన్స్ తీసుకున్న ఎస్‌వీఎం ఆదిత్య హోమ్స్ సంస్థ రూ. 27,16,430 మొత్తాన్ని 10.85 శాతం వడ్డీతో 60 రోజుల్లోగా తిరిగి ఇవ్వాలని అథారిటీ ఆదేశించింది. పటాన్‌చెరు పరిధిలోని ఘన్‌పూర్‌లో 'ఆర్నేట్-1' ప్రాజెక్టులో జాప్యం కారణంగా బుకింగ్ రద్దు చేసుకున్న కొనుగోలుదారుడికి రూ. 17 లక్షలను శ్రీ ఆదిత్య స్వ్కేర్స్ సంస్థ పూర్తి వడ్డీతో తిరిగి చెల్లించాలని ఆదేశిస్తూ, సంస్థ ప్రతిపాదించిన 15 శాతం తగ్గింపు వాదనను తిరస్కరించింది. మహేశ్వరం మండలం సిరిగిరిపురంలోని 'ఎస్‌వీ ఎలక్ట్రానిక్ సిటీ-3' ప్రాజెక్టులో ప్లాట్ రిజిస్ట్రేషన్ చేయని బీవీఆర్ ఇన్‌ఫ్రా డెవలపర్స్ ప్రైవేట్ లిమిటెడ్ రూ. 7 లక్షలను 10.85 శాతం వడ్డీతో మహిళా బాధితురాలికి చెల్లించాలని ఆదేశించింది. అలాగే హఫీజ్‌పేటలోని 'వాసవి లేక్ సిటీ ఈస్ట్' ప్రాజెక్టులో ఫ్లాట్ అప్పగింత ఆలస్యమైనందుకు గాను వాసవి రియల్టర్స్ ఎల్ఎల్పీ సంస్థ కొనుగోలుదారుడికి రూ. 49.50 లక్షలపై 10.85 శాతం వార్షిక వడ్డీని చెల్లించాలని పేర్కొంది. మియాపూర్‌లోని 'అరినే ఎమరాల్డ్' ప్రాజెక్టులో సేల్ డీడ్ పూర్తయినా ఫ్లాట్ అప్పగించని అరినే ఇన్‌ఫ్రా సంస్థ తక్షణమే ఫ్లాట్ నం. 502ను స్వాధీనం చేయాలని, జాప్యానికి గాను వడ్డీ చెల్లించాలని ఆదేశించింది. రియల్ ఎస్టేట్ చట్టం 2016, నిబంధనలు 2017 ప్రకారం జారీ చేసిన ఈ ఆదేశాలను అమలు చేయడంలో విఫలమైతే, డెవలపర్లపై సెక్షన్ 63 ప్రకారం మరింత కఠిన చర్యలు తీసుకుంటామని టీజీ రెరా తీవ్ర హెచ్చరికలు జారీ చేసింది.

రాజగోపాల్ ఫ్రస్ట్రేట్ అవుతున్నా.. పట్టించుకోరా అండి !?



హైదరాబాద్,తెలంగాణ కాంగ్రెస్ పార్టీలో మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి రోజురోజుకూ తీవ్ర అసహనానికి గురవుతూ, సొంత ప్రభుత్వం పైనే తిరుగుబాటు బావుటా ఎగురవేస్తున్నారు. అసెంబ్లీ ఎన్నికల ముందు తనకు మంత్రి పదవి ఇస్తామని అధిష్టానం హామీ ఇచ్చి మోసం చేసిందని ఆవేదన చెందుతున్న ఆయనకు, ఇప్పుడు ఇప్పట్లో క్యాబినెట్‌లో చోటు దక్కే అవకాశం లేదని తేలిపోవడంతో ఇక ఏమాత్రం ప్రశాంతంగా ఉండలేకపోతున్నారు. అదృష్టం కొద్దీ ముఖ్యమంత్రి అయ్యావు, ఇంకో రెండేళ్లే ఉంటావు.. పండబెట్టి తొక్కుతా అనడానికి నీవేం ముఖ్యమంత్రివి, నీదీ ఏం భాష? అంటూ ఏకంగా సీఎం రేవంత్ రెడ్డినే ఏకవచనంతో సంబోధిస్తూ ఆయన చేసిన సంచలన వ్యాఖ్యలు తెలంగాణ రాజకీయాల్లో ప్రకంపనలు సృష్టిస్తున్నాయి.

అసలు బాధ మంత్రి పదవే.. అది దక్కదు!

నిజానికి, రాజగోపాల్ రెడ్డి ఇంతలా ఆగ్రహంతో రగిలిపోవడం వెనుక కేవలం మంత్రి పదవి దక్కకపోవడం మాత్రమే కాకుండా, బలమైన ఆర్థిక, వ్యాపార కారణాలు కూడా ఉన్నాయని రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఇటీవల హైదరాబాద్‌లో రూ. 3,300 కోట్ల రేడియల్ రోడ్ల నిర్మాణ టెండర్ల విషయంలో తమ కుటుంబానికి చెందిన సుశీ ఇన్‌ఫ్రా సంస్థను ప్రభుత్వం పక్కన పెట్టిందని, ఇతర కాంట్రాక్టులు కూడా తమకు రాకుండా అడ్డుకుంటున్నారని ఆయన బహిరంగంగానే ఆరోపించి న్యాయపోరాటానికి దిగారు. ఒకవైపు మంత్రి పదవి రాక, మరోవైపు వ్యాపారపరంగా కాంట్రాక్టులు దక్కక తీవ్ర ఒత్తిడిలో ఉన్న ఆయన.. ఇప్పుడు మునుగోడు నియోజకవర్గానికి నిధుల కేటాయింపులో వివక్ష అనే సెంటిమెంట్ అస్త్రాన్ని అందుకుని ప్రభుత్వంపై తన అక్కసునంతా వెళ్లగక్కుతున్నారు. కొడంగల్‌కు రూ. 20 వేల కోట్లు ఇచ్చుకుంటూ, ఫ్లోరైడ్ పీడిత మునుగోడుకు కనీసం రూ. 500 కోట్లు కూడా ఇవ్వడం లేదని, పింఛన్ల పెంపు, రైతుబంధు అమలులో ప్రభుత్వం విఫలమైందని ప్రతిపక్ష నేత తరహాలో సొంత సర్కార్‌నే ఇరుకున పెడుతున్నారు.

అసలు లెక్కలోకి తీసుకోని పీసీసీ

సొంత పార్టీ ముఖ్యమంత్రిపైనే ఇంతటి తీవ్ర స్థాయిలో విమర్శలు, హెచ్చరికలు జారీ చేస్తున్నప్పటికీ, టీపీసీసీ నాయకత్వం ఆయనపై ఎలాంటి క్రమశిక్షణా చర్యలు తీసుకునేందుకు సిద్ధంగా లేకపోవడం రాజకీయ పరిశీలకులను ఆశ్చర్యానికి గురిచేస్తోంది. ఇటీవల నిధుల విషయంలో కాస్త స్వరం పెంచిన జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డిపై పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ తీవ్రంగా స్పందించి హెచ్చరికలు జారీ చేశారు. కానీ, అంతకంటే పదిరెట్లు ఘాటుగా ముఖ్యమంత్రిని వ్యక్తిగతంగా టార్గెట్ చేస్తున్న రాజగోపాల్ రెడ్డి విషయంలో మాత్రం పీసీసీ పూర్తి మౌనం వహిస్తుండటం పాటిస్తోంది.

ఆయనను సంతృప్తి పరచలేరు!

రాజగోపాల్ రెడ్డిని సంతృప్తి పరచడం అసాధ్యమని కాంగ్రెస్ నేతలకు తెలుసు. మంత్రి పదవి ఇస్తే..హోంమినిస్టర్ శాఖ కావాలంటారు. అది కూడా ఇస్తే కాంట్రాక్టులంటారు. ఆయన పార్టీకి చేసిన కంట్రిబ్యూషన్ కు ఆయన ఆశించే దానికి పొంతన ఉండదు. అందుకే పీసీసీ తో పాటు ఏఐసీసీ కూడా లైట్ తీసుకుంటోందని భావిస్తున్నారు.

వైసీపీ వైపు నాన్ ఎన్డీయే వర్గాలు



అమరావతి,వైసీపీ అధినేత మాజీ సీఎం వైఎస్ జగన్ ఎన్డీయేకు దూరం జరుగుతారా అన్న చర్చ ఒక వైపు సాగుతూంటే నాన్ ఎన్డీయే కూటమి వైపుగా ఆయన నడుస్తారా మరో చర్చగా ఉంది. ఇటీవల కాలంలో జాతీయ స్థాయిలో చోటు చేసుకుంటున్న అనేక పరిణామాలు ఏపీ రాజకీయాలను సైతం తీవ్రంగా ప్రభావితం చేస్తున్నాయి. ఏపీలో ఎన్డీయే కూటమి మాత్రమే ఉంది. నాన్ ఎన్డీయే అలయెన్స్ అయితే లేదు. కానీ ఇపుడు మారుతున్న జాతీయ రాజకీయ సమీకరణల్లో ఏపీలో నాన్ ఎన్డీయే కూటమి బలపడాలని కోరుకుంటున్న వారికి వైసీపీ కేంద్ర బిందువుగా కనిపిస్తోంది. దాంతో వారంతా జగన్ ని కలుస్తున్నారు.

ఓబీసీ జనాభా గణన డిమాండ్ :

ఇదిలా ఉంటే దేశంలో ఓబీసీ జనాభా గణన చేపట్టాలని చాలా కాలంగా డిమాండ్ ఉంది. ఇక ఈ నేపధ్యంలో ఈ డిమాండ్ సాధనలో భాగంగా ఢిల్లీలో భారీ ర్యాలీ నిర్వహిస్తున్నారు. ఈ ర్యాలీకి వైసీపీ అధినేత వైఎస్ జగన్ కి ఆహ్వానం అందింది. అఖిల భారత కుల గణన సమన్వయ కమిటీ ప్రతినిధులు జగన్‌ను తాడేపల్లిలోని కేంద్ర కార్యాలయంలో కలిసి నవంబర్ 28న న్యూఢిల్లీలో జరగనున్న భారీ నిరసన ప్రదర్శనలో పాల్గొనవలసిందిగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా జగన్ దేశవ్యాప్తంగా సమగ్ర కుల గణన జరపాలని జరుగుతున్న డిమాండ్‌కు వైసీపీ తరఫున మద్దతు తెలిపారు.

వ్యక్తిగతంగా హాజరు :

ఇదే సందర్భంలో వెనుకబడిన తరగతులు ఇతర వెనుకబడిన తరగతుల రిజర్వేషన్ హక్కులను పరిరక్షించడానికి ఢిల్లీలోని రామ్‌లీలా మైదాన్‌లో ర్యాలీ చేపడుతున్నారు. ఈ జాతీయ స్థాయి ర్యాలీకి వ్యక్తిగతంగా హాజరు కావాలని వారు జగన్‌ను కోరారు. మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, కర్ణాటక, తమిళనాడు వంటి వివిధ రాష్ట్రాలకు ప్రాతినిధ్యం వహిస్తున్న దేశవ్యాప్తంగా ఉన్న 60 కి పైగా ఓబీసీ సంస్థలతో పాటు, కాశ్మీర్ నుండి కేరళ వరకు విస్తరించి ఉన్న ఇతర ప్రాంతాల నుంచి బీసీలు ఓబీసీలు ఈ ర్యాలీకి హాజరవుతున్నారని కమిటీ ప్రతినిధులు చెబుతున్నారు.

అందరినీ ఏకత్రాటిపైకి :

ఓబీసీ జనాభా గణన ఉద్యమాన్ని బలోపేతం చేయడానికి దేశవ్యాప్తంగా ఉన్న ఎన్డీఏ యేతర రాజకీయ పార్టీల మద్దతును సమీకరించేందుకు కూడా తమ కమిటీ ప్రయత్నిస్తోందని ఢిల్లీ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్, మాజీ మండల్ కమిషన్ చైర్మన్ బిపి మండల్ మనవడు సూరజ్ మండల్ తెలిపారు. రాబోయే జాతీయ జనాభా గణనలో ఓబీసీలకు ప్రత్యేక కాలమ్ ప్రవేశపెట్టాల్సిన అవసరాన్ని ప్రొఫెసర్ సూరజ్ మండల్ నొక్కి చెప్పారు. ప్రతి కులాన్ని సరిగ్గా గుర్తించి, వారి జనాభాను ఖచ్చితంగా నమోదు చేసేందుకు ప్రతి కులం పేర్లతో కూడిన డ్రాప్-డౌన్ మెనూను ఏర్పాటు చేయాలని కూడా ఆయన పిలుపునిచ్చారు. వివిధ వర్గాల జనాభాకు అనుపాతంగా రిజర్వేషన్ ప్రయోజనాలు అందేలా చూడటానికి ఇంతటి సమగ్రమైన సమాచారం అవసరమని ఆయన అన్నారు.

ఎస్సీ ఎస్టీ తరహాలోనే :

ఇక దేశంలో షెడ్యూల్డ్ కులాలు షెడ్యూల్డ్ తెగల కోసం చేపట్టిన జనాభా గణన తరహాలోనే అన్ని ఓబీసీ వర్గాలను కలుపుకొని సమగ్ర కుల గణన చేపట్టాలని ఆయన కోరారు. అలాగే వారి సామాజిక, ఆర్థిక పరిస్థితులు కూడా నమోదు చేయాలని తమ సంస్థలు డిమాండ్ చేస్తున్నాయని ప్రొఫెసర్ సూరజ్ మండల్ అన్నారు. కోర్టులలో బీసీ రిజర్వేషన్ నిబంధనలను పరిరక్షించడానికే కాకుండా రిజర్వేషన్లపై ప్రస్తుతం ఉన్న 50 శాతం పరిమితిని సవాలు చేసే డిమాండ్‌ను కొనసాగించడానికి కూడా విశ్వసనీయమైన కుల గణన సమాచారం చాలా కీలకమని పేర్కొన్నారు. ఖచ్చితమైన జనాభా గణాంకాలు లేకపోవడం వల్ల, తగిన రాజకీయ, విద్యా, ఉపాధి ప్రాతినిధ్యం కోసం తమ డిమాండ్లను నిరూపించుకునే ఓబీసీ వర్గాల సామర్థ్యం బలహీనపడిందని ఆయన అన్నారు.

ఈ నెల 23 నుంచి ప్రత్యేక పార్లమెంట్ సమావేశాలు ?



న్యూఢిల్లీ,పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలకు కేంద్ర ప్రభుత్వం రంగం సిద్ధం చేస్తోంది అని ఢిల్లీ వర్గాలలో వార్తలు వినిపిస్తున్నాయి. నవంబర్ 23 నుంచి 25 దాకా మూడు రోజుల పాటు పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలు జరగనున్నాయని అంటున్నారు. నిజానికి డిసెంబర్ లో శీతాకాల సమావేశాలు ఉండగా ఈ ప్రత్యేక సమావేశాలు ఎందుకు అన్న ప్రశ్న ఉత్పన్నం అవుతుంది. అయితే కేంద్రంలోని బీజేపీ నాయకత్వం డీలిమిటేషన్ మహిళా రిజర్వేషన్ల అమలు బిల్లులను ఆమోదించుకోవడానికి గట్టి పట్టుదలతో ఉన్న సంగతి తెల్సిందే. దాంతోనే ఈ ప్రత్యేక సమావేశాలు అని అంటున్నారు.

పక్కాగా ఆమోదం :

ఈసారి ఎలాగైనా డీలిమిటేషన్ బిల్లును ఆమోదించుకోవాలని బీజేపీ పెద్దలు భారీ కసరత్తు చేస్తున్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ 2029 సార్వత్రిక ఎన్నికల నాటికి 33 శాతం మహిళా రిజర్వేషన్లను అమలులోకి తీసుకురావడానికి వీలుగా నియోజకవర్గాల పునర్విభజన బిల్లును ఆమోదించుకోవడమే ఈ సమావేశాల ప్రధాన ఉద్దేశమని తెలుస్తోంది. అదే సమయంలో బీజేపీకి లోక్ సభలో ఈ బిల్లుల ఆమోదానికి అవసరం అయిన బల సమీకరణకు కూడా ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ బిల్లులు రాజ్యాంగ సవరణ బిల్లు ఆమోదం పొందేందుకు మూడింట రెండొంతుల మెజారిటీ అవసరం కాగా, తమకు అవసరమైన దానికంటే 15 నుంచి 18 ఓట్లు అదనంగానే ఉన్నాయని బీజేపీ వర్గాలు ధీమా వ్యక్తం చేస్తున్నట్లుగా చెబుతున్నారు.

ప్రత్యేకంగానే :

నిజానికి శీతాకాల సమావేశాల ముందు ఈ సమావేశాలు ఎందుకు అంటే వేరే అజెండా కానీ ఇతర అంశాలు కానీ చర్చకు రాకుండా కేవలం ఫోకస్ పెట్టడానికే అని అంటున్నారు. ఒక వైపు సాధారణ శీతాకాల సమావేశాలు డిసెంబర్ మొదటి వారంలో ప్రారంభమయ్యే అవకాశం ఉన్నందున అంతకంటే ముందే ఈ మూడు రోజుల ప్రత్యేక భేటీని నిర్వహించాలని కేంద్రం భావిస్తున్నట్లు హస్తినలో వార్తా కథనాలు తెలియచేస్తున్నాయి. మరో వైపు చూస్తే ఆగస్టులో ముగిసిన వర్షాకాల సమావేశాలను ఇప్పటివరకు ప్రోరోగ్ అంటే నిరవధికంగా వాయిదా వేసి ముగించడం చేయనందున తక్కువ నోటీసుతోనే తిరిగి సభను సమావేశపరిచే వెసులుబాటు ప్రభుత్వానికి ఉంది. అంటే ఎప్పుడు కావాలనుకుంటే అప్పుడు సభను సమావేశపరచి చర్చించవచ్చు అన్న మాట.

ఆ ఓట్లు ఎలా వస్తాయి :

డీ లిమిటేషన్ బిల్లు ఆమోదం అంటే రాజ్యాంగ సవరణకు 362 మంది ఎంపీల మద్దతు ఉండాలి. అయితే తమకు ఆ సంఖ్యా బలంతో పాటుగా మరో పదిహేను నుంచి 18 ఓట్లు ఎక్కువగానే వస్తాయని బీజేపీ పెద్దలు ధీమా వ్యక్తం చేస్తున్నాయని చెబుతున్నారు. అంటే 380 దాకా ఓట్లు అన్న మాట. అదెలా సాధ్యం అన్నది ఇపుడు చర్చగా ఉంది. బీజేపీకి ఉన్న ప్రస్తుత బలం 324 కి మించలేదు. అంటే మరో 56 మంది ఎంపీలు ఎక్కడ నుంచి మద్దతు ఇస్తారు అన్నది పెద్ద ప్రశ్నగానే ఉంది. అయితే రాజకీయాల్లో ఏదీ అసాధ్యం అనూహ్యం కాదు అని అంటున్నారు. పైగా మరో వారం రోజుల వ్యవధిలోనే పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలకు బీజేపీ పెద్దలు నిర్ణయం తీసుకుంటున్నారు అంటే గట్టి కసరత్తు దీని వెనక జరిగినట్లుగా ప్రచారం సాగుతోంది. ఈ నెల 25 వరకూ మూడు రోజుల పాటు సాగే ఈ సమావేశాలలో ఓటింగ్ 25న జరుగుతుంది అని అంటున్నారు. ఒక విధంగా ఆ రోజు బిగ్ జడ్జిమెంట్ డే గానే చూడాల్సి ఉంది. ఎందుకంటే దేశ రాజకీయ ముఖ చిత్రాన్ని మొత్తంగా మార్చేసే రాజ్యాంగ సవరణకు ఆ రోజు తీర్పుని ఎంపీలు ఇస్తారు.

Edited, Printed, Published & owned by KOTAGIRI CHANDRA SHEKAR, Published From, H.NO.5-7-163 PRAKASHAM BAZAR, NALGONDA TOWN, TELANGANA- 508 001, Printed at KOTAGIRI GRAPHICS & KOTAGIRI OFFSET PRINTER, H.NO.5-7-163 PRAKASHAM BAZAR, NALGONDA TOWN, TELANGANA-